STV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 45 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 23 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

# లైన్‌క్లియర్

## పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు..

జీవో 46తో కొత్త మార్గదర్శకాలు




**హైదరాబాద్, నవంబర్22:** తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపుకు ప్రభుత్వం కీలకమైన జీవో 46ని జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో మొత్తం రిజర్వేషన్లు ఎప్పటికీ 50శాతం దాటకూడదనే నిబంధనను స్పష్టంగా పేర్కొన్నది. ఈ నియమం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల రిజర్వేషన్ల మధ్య సమతుల్యత నెరవేరనున్నది. ఈ చర్యతో గ్రామీణ పాలనలో న్యాయమైన ప్రాతినిధ్యం లభిస్తుందని అధికారగణం భావిస్తున్నది.

మిగతా 2 లో




# సేవే ధర్మం.. ప్రేమే మార్గం

తన సందేశాలతో బాబా పరివర్తన

లక్షల మందికి తాగునీటి వసతి సౌకర్యం

పేదలకు ఉచితంగా వైద్య సేవల కల్పన

సాయి శతజయంతి ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు

**పుట్టపర్తి :** సత్యసాయి బాబా తన సందేశాలతో చాలామందిలో పరివర్తన తెచ్చారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి సమస్య లేకుండా బాబా అనేక ప్రాజెక్టులు నెలకొల్పారు. విరాళాల రూపంలో వచ్చిన నిధులను ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించారు. అనేక గ్రామాల్లో లక్షల మందికి తాగునీరు అందించారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారు. సత్యసాయి ట్రస్టుకు లక్షల మంది వాలంటీర్లు ఉన్నారు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మి సత్యసాయి ఆచరించారు. భగవాన్ సాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించింది. దాన్ని మనమంతా అర్థం చేసుకోవాలని చంద్రబాబు అన్నారు. లవ్ ఆల్.. సర్వ్ ఆల్, ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలని... ఎవ్వరినీ నొప్పించకూడదు అనేది సత్యసాయి బాబా సిద్ధాంతమని

మిగతా 5 లో



విశ్వప్రేమకు ప్రతిరూపం సత్యసాయి

5

సాయి బోధనలు లక్షల మందికి మార్గనిర్దేశనం

పుట్టపర్తి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

## అరటి రైతులను ఆదుకునేందుకు ముంబైకి రైల్వే వ్యాగన్లు

పత్తి, మొక్కజొన్న రైతుల సమస్యలపై సీఎం చంద్రబాబు సమీక్ష

ధరల స్థిరీకరణ నిధితో మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు

రంగుమారిన పత్తిని కూడా కొనాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచన

5




## సత్యసాయి ఆశిస్సులతో అగ్రస్థానానికి భారత్

సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి

సాయి సమాధి వద్ద నివాళి అర్పించిన రాధాకృష్ణన్

**పుట్టపర్తి :** సత్యసాయి ఆశీస్సులతో 2047 నాటికి భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ఆశిస్తున్నట్టు ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ తెలిపారు. సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి

మిగతా 2 లో

## పెన్నే కదాని తృణీకరిస్తే గన్నై కూల్చింది

కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం

ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు

అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు

ఆయన లేకుండా తెలంగాణ ఉద్యమ-సభలు లేవు

అందెశ్రీ సంస్మరణ సభలో సీఎం రేవంత్

03





## ప్రపంచ సంరక్షుడిగా హిందూ సమాజం

హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ప్రమాదం

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

.. వివరాలు 4లో



## దేశంలో పేలుళ్లకు జైషే కుట్రలు

ఆత్మాహుతి బాంబర్ ఉమర్‌కు నిధులు

డాక్టర్లే నిధులు సమకూర్చారని గుర్తింపు

.. వివరాలు 4లో

## 37మంది మావోయిస్టుల లొంగుబాటు

వీరిలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆజాద్, అప్పాసి నారాయణ, సోమడా

తెలంగాణ డీజీపీ ఎదుట ఆయుధాల అప్పగింత

సెంట్రల్ కమిటీలోని ఐదుగురు లొంగిపోవాలి : డీజీపీ రెడ్డి పిలుపు



## చెక్‌డ్యామ్ పేల్చివేత



ఇసుక అక్రమార్కుల దుశ్చర్య

రూ.3కోట్ల ఆస్తి నష్టం

పెద్దపల్లి జిల్లాలో దారుణం

02



## నేడు భారత్ బంద్

మావోయిస్టుల పిలుపు..

అప్రమత్తం అయిన పోలీసులు



# తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా

**పోలీసుల విచారణలో సహకరించని రవి ● ముగిసిన విచారణ**

**హైదరాబాద్, నవంబరు 22:** సినిమాల పైరసీ కేసులో ఐ బొమ్మ ఇమంది రవి పోలీసుల విచారణ శనివారం మూడో రోజు ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో భాగంగా ఇమంది రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీశారు. పైరసీకి ఎవరు సహకారం అందిస్తున్నారు.. తెర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారనే విషయాలపై పోలీసులు ప్రశ్నించారు. సైబర్ నేరాలకు ఐ బొమ్మ సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సినిమాల సేకరణ, సైట్‌లో అప్‌లోడ్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. అయితే, విచారణలో పోలీసులకు రవి సహకరించడం లేదని సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు చెబుతున్నాడని తెలిసింది. యూజర్ ఐడీ, పాస్‌వర్డులు అడిగితే గుర్తు లేదు.. మరిచిపోయానని రవి సమాధానం చెప్పినట్లు సమాచారం. ఎథికల్ హ్యాకర్ల సహాయంతో హార్డ్‌డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లను పోలీసులు ఓపెన్ చేస్తున్నారు. ఫ్రాన్స్, నెదర్లాండ్‌లో మెయిన్ సర్వర్లు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. బ్యాంక్ ఖాతాల విషయంలోనూ రవి నోరువిప్పలేదని.. రవి అకౌంట్ల వివరాలు ఇవ్వాలని పలు బ్యాంకులకు పోలీసులు మెయిల్ పంపారు. ప్రతీరోజూ 20 రోజులకు ఒక్కో దేశానికి రవి వెళ్లాడని.. దీనిపై ప్రశ్నిస్తే తనకు విదేశీ పర్యటనలంటే ఇష్టమని.. అందుకే వెళ్లాలని రవి చెప్పినట్లు తెలియవచ్చింది. రవి పర్యటించిన దేశాల్లో పైరసీ లింకుల కూపీ లాగుతున్నారు పోలీసులు.

# అల్పపీడనంతో వర్ష సూచన



**హైదరాబాద్, నవంబరు 22:** తెలంగాణలో రాగల రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మలక్కా జలసంధిలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం ఉదయం 8.30 గంటలకు దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ తెలిపింది. పశ్చిమ–వాయువ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తర్వాతి 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఆదివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. పలుచోట్ల పొగమంచు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం సైతం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని వివరించింది. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పొడి వాతావరణం ఉంటుందని వివరించింది.

# 9మంది నాన్ కేడర్ ఎస్పీల బదిలీ

**హైదరాబాద్,నవంబరు 22 :** తెలంగాణలో తొమ్మిది మంది నాన్ క్యాడర్ ఎస్పీలను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటెలిజెన్స్ ఎస్పీలుగా పీ కరుణాకర్, ఎస్వీఎన్ శివరామ్, ఆర్ జగదీశ్వర్‌రెడ్డిని బదిలీ చేసింది. సైబరాబాద్ ఎస్‌బీ డీజీపీగా వైవీఎస్ సుధీంద్ర, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా సాయిశ్రీ నియామకమయ్యారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా వి అరవింద్ బాబు, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా ధార కవిత, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా ఎం రవీందర్‌రెడ్డి, సీఐడీ ఎస్పీగా ఎన్ అశోక్ కుమార్ బదిలీ నియామకమయ్యారు. ఇదిలా ఉండగా శుక్రవారం ప్రభుత్వం 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉన్నతాధికారుల బదిలీలు చేపట్టింది. 32 మంది అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# డీసీసీ అధ్యక్షుల నియామకాలు



**ఎమ్మెల్యేలకు పలుచోట్ల పార్టీ అధ్యక్ష బాధ్యతలు**

**న్యూఢిల్లీ, నవంబర్ 22:** తెలంగాణలో స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఖాళీగా ఉన్న డిసిసి పదవులను భర్తీ చేసింది. క్షేత్రసత్యాయిలో ప్రజలను సమీకరించేందుకు ఎమ్మెల్యేలకు పలుచోట్ల బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో తెలంగాణ డీసీసీలకు కొత్త అధ్యక్షులను ఏఐసీసీ ప్రకటించింది. 30 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమించి వారి పేర్లను విడుదల చేసింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిధిలోని జిల్లాల కాంగ్రెస్ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ వారి పేర్లు వెల్లడించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడి ఆమోదం మేరకు ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఇందులో ఆదిలాబాద్ – డాక్టర్ నరేష్ జాదవ్,ఆసిఫాబాద్ – ఆత్రం సుగుణ, భద్రాద్రి కొత్తగూడెం –దేవి ప్రసన్న, భువనగిరి – బీర్ల ఐలయ్య, గద్వాల – రాజీవ్ రెడ్డి, హన్మకొండ – ఇనిగాల వెంకట్రామి రెడ్డి, హైదరాబాద్ – సయ్యద్ ఖలీద్ సహిఫుల్ల జగిత్యాల – నందయ్య, జనగాం – ధన్వంతి, జయశంకర్ – భూపాల పల్లి కరుణాకర్,కామారెడ్డి – మల్లికార్జున ఆలెలను నయిమించారు. ఇందులో కొందరు కార్పోరేషన్ ఛైర్మన్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

## ఎంబీఏ ఫలితాలు విడుదల

**హైదరాబాద్,నవంబరు 22 :** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.


# మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్

- వరుస ఎన్‌కౌంటర్ల తరవాత 37మంది లొంగుబాటు
- లొంగిపోయిన వారిలో కేంద్రకమిటీ సభ్యులు ఆజాద్
- గణపతి తదితరులంతా అజ్ఞాతం వీడి రావాలన్న డీజీపీ



**హైదరాబాద్, నవంబర్ 22:** మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. వరుస ఎన్‌కౌంటర్ల తరవాత తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ–3 రైఫిల్స్, ఎకె47లు, భారీగా బు÷–లలెట్స్ స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం అని తెలిపారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తాం. మిగతావాళ్లు కూడా తొందరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అన్నారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణెలిశ్,బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. మావోల లొంగుబాటు సందర్భంగా ఆయన పలు అంశాలు వివరించారు. ఏ రకంగా బయటికి వచ్చినా.. మావోయిస్టులను అన్ని విధాలుగా ప్రభుత్వం చూసుకుంటుందని డీజీపీ అన్నారు. మీడియా ద్వారా వచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా వచ్చినా, రాజకీయ నాయకుల ద్వారా వచ్చినా తాము స్వాగతిస్తామని డీజీపీ పేర్కొన్నారు. మావోయిస్టులు పార్టీ పరంగా విబేధాలు, ఆరోగ్య కారణాలు, ఇలా అనేక కారణాలతో బయటికి వస్తున్నారని డీజీపీ తెలిపారు. 'తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్ మీద రూ.20లక్షల రివార్డ్ ఉంది. అప్పాసి నారాయణ మీద రూ.20లక్షలు రివార్డ్ ఉంది. మిగతా వారికి రూ.25 వేలు చొప్పున ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. 11 నెలల్లో 465మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 59మంది తెలంగాణకు చెందిన వారని డీజీపీ వెల్లడించారు.

# పంచాయతీకి లైన్ క్లియర్




**హైదరాబాద్,నవంబరు 22:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చకు రేవంత్ సర్కార్ తెర దింపింది. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వేషన్ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జీవో విడుదల చేసింది. పంచాయతీరాజ్ జీవో ప్రకారం రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు. 50శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ , ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం బీసీలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి. ఇదిలావుంటే వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలు, భద్రతా చర్యలు, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సమావేశంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈసీ చర్యలు అధికార యంత్రాంగాన్ని ఉత్సాహపరుస్తున్నాయి. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ రాణి కుమిదిని, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతల నిర్వహణ సులభతరం చేయడానికి ప్రతి జిల్లాలో ఎన్నికలను మూడు దఫాలుగా నిర్వహించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా ఒక ప్రాంతంలోని ఎన్నికలు పూర్తయిన తర్వాత, మరొక ప్రాంతంలో ఎన్నికలకు మధ్యలో రెండు రోజుల విరామం ఉండాలని డీజీపీ అభిప్రాయపడ్డారు. ఈ విరామం వలన సిబ్బందికి, భద్రతా బలగాలకు తగిన సమయం లభిస్తుందని, బందోబస్తు నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన రోజు ఫలితాలు సాయంత్రం ప్రకటిస్తున్న నేపథ్యంలో ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉన్నందున రెండు రోజుల విరామం అవసరమని స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ స్థాయి ఉత్సవంలా

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు భారీ ఏర్పాట్లు**

**ఫ్యూచర్ సిటీలో సువిశాల ప్రాంగణం.. భారీ వేదిక**

**తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ కు తుది మెరుగులు**

**25వ తేదీ నుంచి విభాగాల వారీగా సమీక్ష సమావేశాలు**

**గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో సీఎం రేవంత్**



**హైదరాబాద్, నవంబర్ 22 :** డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్తో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు సీఎంవో అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినందున, రెండేండ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ, తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలన్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరగాలన్నారు. 9వ తేదీన రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలన్ని కళ్లకు కట్టించే ఆడియో వీడియో ప్రదర్శనలు, ప్రజంటేషన్లు తయారు చేసుకోవాలని సీఎం సూచించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని సీఎం ఆదేశించారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంతో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్లో కీలకంగా పాలుపంచుకోవాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. అభివృద్ధిలో కీలకమైన రంగాలు, అందులో పాలుపంచుకునే అనుసంధాన విభాగాలన్నింటితో ఒక్కో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు రెండేండ్ల ప్రగతి, తెలంగాణ రైజింగ్ 2047లో ఆయా విభాగాల పాత్రపై ప్రధానంగా సమీక్ష జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రజల అభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదృష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందని సీఎం తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో నిర్వహించే సమీక్షల్లో వచ్చే విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలను పొందుపరిచి డాక్యుమెంట్ కు తుదిరూపం ఇస్తామని అభిప్రాయపడ్డారు.




# చెక్ డ్యామ్ పేల్చివేత

**ఇసుక అక్రమార్కుల దుశ్చర్య**

**రూ.3కోట్ల ఆస్తి నష్టం ● పెద్దపల్లి జిల్లాలో దారుణం**


**పెద్దపల్లి, నవంబర్22:** ఇసుక అక్రమార్కులు తమ వ్యాపారం కోసం దుశ్చర్యకు పాల్పడ్డారు. ఇసుక అక్రమ రవాణా కోసం అడ్డుగా ఉన్న చెక్ డ్యామ్ ను కూల్చివేశారు. పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం గుంపులలో 23 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న చెక్ డ్యామ్ బాంబులు పెట్టి శనివారం ఉదయం పేల్చివేశారు. మానేరు వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యామ్ వల్ల నీరు నిలిచి ఉండడంతో ఇసుక అక్రమ రవాణాకు వీలుపడటం లేదని భావించిన అక్రమార్కులు బాంబులు పెట్టి చెక్ డ్యామ్ ను పేల్చివేశారు. ఈ ఘటనలో మూడు ప్యానల్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వీటిని విలువ మూడు కోట్లకు పైగా ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు తెలియజేశారు. రూ.23కోట్లతో మానేరు వాగుపై నిర్మిస్తున్న చెక్ డాం పనులు పూర్తి కావడంతో అధికారులు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసే సమయంలో ఇసుక అక్రమార్కులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ అధికారులతో పాటు పోలీసు అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్నారు.



# పెన్నే కదాని తృణీకరిస్తే.. గన్నై కూల్చింది

- కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం
- ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు
- అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు
- ఆయన లేకుండా ఉద్యమసభలు లేవు
- అందెశ్రీ సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి






**హైదరాబాద్, నవంబర్ 22:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారే ముందుండి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లారని అన్నారు. వారు లేకుంటే తెలంగాణ లేదని అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు. ఉద్యమానికి కవులు, కళాకారులు ఇచ్చిన ఊపుతోనే తెలంగాణ సాకారమైందని, ఇది ఎవరూ కాదనలేని నిజమన్నారు. అంతేగాకుండా వారే తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని మోసారని అన్నారు.. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. బడికి వెళ్ళని అందె శ్రీ రాసిన జయ జయ హే తెలంగాణ గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది అని రేవంత్ తెలిపారు. బాధతో.. ఉద్వేగంతో చెప్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారు. తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా గత పాలకుల చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు. అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని గుర్తు చేశారు. ఊరూరా పాటలతో అందెశ్రీ ఉద్యమానికి ఊపిరిలూదారని అన్నారు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. ఆయనను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాలకుల దృష్టిలో పదేళ్లు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం ఆనాడు జరిగిందన్నారు. కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారని సిఎం రేవంత్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 9 మంది ఉద్యమకారులను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమకారులది. దేశంలో ఎస్సి వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. వర్గీకరణ అనేది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.. అలాగే సమాజాన్ని ముందుకు నడిపించాలానే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రమంత్రి వర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం అనేది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే నిర్ణయాలు తీసుకున్నాం.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రనిదే అసలైన గొప్పతనం.. అలాగే కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న.. కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటం వద్ద అందరూ నివాళి అర్పించారు. జయజయహేతో సభ మార్మోగింది. అందెశ్రీ అమర్ రహే అన్న నినాదాలు మిన్నంటాయి.

# 5లక్షల కోట్ల భూములకు రెక్కలు

## 5వేల కోట్లకే అస్మదీయులకు కట్టబెట్టే కుట్ర

## ప్రభుత్వ తీరును తప్పపట్టిన హరీష్ రావు



**హైదరాబాద్,నవంబర్22:** పారిశ్రామిక అవసరాల కోసం 50–60 ఏళ్ల కిందట కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో.. అజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు.. ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100శాతం నుంచి 200 శాతం అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతానికే అప్పగించాలని చూస్తోంది. 7 రోజుల్లో దరఖాస్తులు 7 రోజుల్లో ఆమోదాలు 45 రోజుల్లో పూర్తి క్రమబద్ధీకరణ ఎవరికి లాభం చేకూర్చడానికి ఈ వేగవంతమైన పక్రియ అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం చేస్తున్నారు. రూ.5లక్షల కోట్లు రావాల్సిన భూములకు కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే ఎలా వస్తాయి? రెండు సంవత్సరాల బ్జడెట్‌కు సరిపడా నిధులు వచ్చే నిర్ణయాన్ని ఏకపక్షంగా ఎలా తీసుకుంటారని నిలదీసారు. మంత్రిమండలి, అసెంబ్లీలో చర్చించకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారు? రూ.లక్షల కోట్ల విలువైన భూములను ఆగమేఘాల మీద ఎలా అప్పగిస్తారు? రెండు నెలల్లోనే పక్రియ అంతా పూర్తి చేయటం వెనుక కుట్ర ఏమిటి? భూములను బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తే.. రూ.5లక్షల కోట్లు వస్తాయి. ప్రభుత్వ అవసరాలకు కూడా భూమి లేకుండా ఎలా విక్రయిస్తున్నారు. కాలుష్య కారక పరిశ్రమలను మాత్రమే ఓఆర్ఆర్ అవతలకు పంపించాలనేది పాలసీ. కానీ, ఈ ప్రభుత్వం గ్రీన్ ఇండస్ట్రీలను కూడా బయటికి పంపిస్తోంది. 9,290 ఎకరాల భూముల ద్వారా కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకొంటున్నారు. పరిశ్రమల కోసం ఇచ్చిన భూములను మల్టీపర్పస్ అవసరాలకు ఎలా అనుమతిస్తారు. భారీ కుంభకోణంపై కేంద్రంలోని భాజపా ఎందుకు స్పందించటం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# నకిలీ లేడీ ఖాకీ పట్టివేత

## పోలీస్ డ్రెస్‌లో ఏకంగా వివిపి డ్యూటీ

**హైదరాబాద్, నవంబర్ 22:** హైదరాబాద్‌లో నకిలీ ఖాకీ వ్యవహారం వెలుగుచూసింది. జీడిమెట్ల పోలీసు పరిధిలో నకిలీ లేడీ కానిస్టేబుల్‌గా వ్యవహరించిన ఉమాభారతి అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. కానిస్టేబుల్ పోస్టుకి సెలెక్ట్ కాలేకపోయినా, తాను పోలీసు సిబ్బందిలోనే పనిచేస్తున్నట్లు చాటుకునేలా ఖాకీ డ్రెస్ కొనుగోలు చేసి, పలు వీఐపీ కార్యక్రమాలకు బందోబస్తు డ్యూటీలు చేసిన విషయం బయటపడింది. తెలంగాణ పోలీసు కానిస్టేబుల్ అర్హత పరీక్షలకు ప్రిపేర్ అవుతూ, పోలీసులలో పనిచేయాలనే కోరికతో ఉమాభారతి ముందుగా డ్రెస్ కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం హైదరాబాదులో జరిగిన కీలక వీఐపీ కార్యక్రమాల్లో.. సచివాలయంలో జరిగిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ఖైరతాబాద్ గణేలిష్ ఉత్సవాల ఊరేగింపు వంటి ఈవెంట్లలో బందోబస్తుల పేరుతో తిరిగినట్లు వెల్లడైంది. సైబరాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి కూడా వెళ్లి, అక్కడి క్యాంటీన్‌లో గడిపి వెళ్లిపోయిన విషయం విచారణలో బయటపడింది. అంతేకాకుండా పలు కాలేజీల్లోకి వెళ్లి 'సైబర్ క్రైమ్ అవేర్‌నెస్' పేరుతో లెక్చర్లు ఇచ్చిందని కూడా పోలీసులు గుర్తించారు. ఒక దశలో ఉమాభారతి ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను ప్రశ్నించడంతో మొత్తం నకిలీ ఖాకీ డ్రామా బట్టబయలైంది. అసలు పోలీసు ఉద్యోగం లేకపోయినా, అధికారులు, సిబ్బంది తెలియకుండా వీఐపీ డ్యూటీలను కూడా ఎలా చేసిందన్న దానిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అన్నపూర్ణ స్టూడియోను సందర్శించిన భట్టి

## ఫల్మ్, మీడియాలో విద్యార్థుల సృజనాత్మకతకు ఫిదా

## అక్కినేని నాగార్జున దంపతుల పట్టుదలకు అభినందన







**హైదరాబాద్,నవంబరు 22:** 2047నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ లక్ష్యంలో చిత్ర పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ భవిష్యత్తును నిర్మించడంలో చిరంజీవి, అక్కినేని నాగార్జున వంటి సీనియర్ సినీ దిగ్గజాల మద్దతు కోసం మేము ఎదురుచూస్తున్నామని అన్నారు.మంగళవారం అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ / మీడియాను సందర్శించి విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించారు. 1970లో కనీస మౌలిక సదుపాయాలు లేని ఈ ప్రాంతంలో దిగ్గజ అక్కినేని నాగేశ్వరరావు అన్నపూర్ణ స్టూడియోలను ఎలా స్థాపించారో, అప్పటి నుండి అది హైదరాబాద్‌లోని అత్యంత ముఖ్యమైన సాంస్కృతిక మరియు సినిమాటిక్ ల్యాండ్‌మార్క్‌లలో ఒకటిగా ఎలా ఎదిగిందో గుర్తుచేసుకుంటూ, సంస్థ యొక్క గొప్ప వారసత్వాన్ని భట్టి విక్రమార్క ప్రశంసించారు. అన్నపూర్ణ కళాశాలలో ప్రపంచ స్థాయి చలనచిత్ర విద్య ద్వారా ఈ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో నాగార్జున అక్కినేని, అమల అక్కినేని విజన్ ను ఆయన అబినందించారు. అన్నపూర్ణ కళాశాల విద్యార్థులు రూపొందించిన రోల్ నంబర్ 52ని నేను చూశాను. నాకు ఎంతగానో నచ్చింది, మనసుని హత్తుకునే మంచి సినిమా తీసినందుకు దర్శకుడిని వారి టీమ్ ను అభినందిస్తున్నాను. అన్నపూర్ణ కళాశాలలో ఎందరో ప్రతిభావంతులు, వారి ప్రతిభ గురించి అక్కినేని నాగార్జున స్వయంగా నాతో మాట్లాడారు, అదే నన్ను ఇన్స్పైర్ చేసింది. మీ అందరిని కలవడానికే ఇక్కడికి వచ్చానని అన్నారు. అక్కినేని నాగార్జున మాట్లాడుతూ ' నా తండ్రి తెలుగు చిత్ర పరిశ్రమను చెన్నై నుండి హైదరాబాద్‌కు తరలి వచ్చినపుడు ఆయన విజన్ కు అనుగునంగా అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించబడింది. నేడు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో భారతదేశంలోని అత్యుత్తమ సంస్థలలో అన్నపూర్ణ స్టూడియోస్ ఒకటిగా నిలిచింది. అన్నపూర్ణ కళాశాల భవిష్యత్ కథకులను పెంపొందించాలనే తన కలను కొనసాగిస్తోంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ రోజు మా స్టూడియోస్ ను సందర్శించడం మాకు గౌరవంగా ఉంది. ప్రపంచ సినిమాలో తెలంగాణ వృద్ధికి మద్దతు ఇవ్వడానికి మేము ఎప్పుడు రెడీగా ఉంటామని అన్నారు. అనంతరం డిప్యూటీ ముఖ్యమంత్రి అన్నపూర్ణ స్టూడియోస్, సౌండ్ / విజన్ భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ ఫెసిలిటీ సినిమాను కూడా సందర్శించారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలు మరియు అత్యాధునిక సాంకేతికత వివరాలు అడిగి తెల్సుకుని నాగార్జునను మెచ్చుకున్నారు.



# రాష్ట్రపతికి గవర్నర్, సీఎం వీడ్కోలు

## రేవంత్‌తో మధ్యప్రదేశ్ సీఎం యాదవ్ భేటీ

**హైదరాబాద్,నవంబర్ 22:** హైదరాబాద్‌లో రాష్ట్రపతి ముర్ము పర్యటన ముగిసింది. ఒకరోజు పర్యటన కోసం వచ్చిన ఆమె శనివారం మధ్యాహ్నం ఇక్కడి నుంచి పుట్టపర్తికి బయలుదేరి వెళ్లారు. బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డిలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీఎం జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌ను మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ కలుసుకున్నారు. మర్యాదపూర్వకంగానే కలిసినట్లు తెలిపారు. యాదవ్‌ను సీఎం సాదరంగా ఆహ్వానించారు.

# పెళ్లి కాకముందే తల్లయిన యువతి

## పుట్టిన బిడ్డను అమ్మేందుకు యత్నించి భంగపాటు



**కరీంనగర్, నవంబర్ 22:** ఈ మధ్య కాలంలో శిశువు విక్రయాలు ఎక్కువయ్యాయి. అక్రమ సంబంధం ద్వారా పుట్టిన బిడ్డను అమ్మేసేందుకు ప్రయత్నిస్తుంటారు కొందరు మహిళలు. మరికొన్ని చోట్ల బిడ్డను పోషించే స్థోమత లేక అమ్మకానికి పెట్టేస్తున్నారు. ఇఓ మహిళ కూడా ఇలాంటి దారుణానికే పాల్పడింది. అప్పుడే పుట్టిన బిడ్డను విక్రయించేందుకు ప్రయత్నించి చివరకు ఊచలులెక్కబెడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో యువతి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ యువతి ఓ వ్యక్తిని ప్రేమించింది. ప్రేమికుడి కారణంగా గర్భవతి అయిన యువతి.. మగబిడ్డకు జన్మనిచ్చింది. కానీ అతడు మోసం చేయడంతో బిడ్డను ఎలా పోషించాలో తెలియక దారుణ నిర్ణయిం తీసుకుంది. తనకు పుట్టిన బిడ్డను అమ్మకానికి పెట్టింది. ఏకంగా ఆరు లక్షలకు శిశువును విక్రయించేందుకు బేరం కుదిరింది. బిడ్డను విక్రయించేందుకు కొంతమంది మధ్యవర్తులుగా వ్యవహరించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చాకినివానిప్లలెకి చెందిన రాయమల్లు, లత దంపతులకు శిశువు విక్రయానికి ఒప్పందం కుదిరింది. విషయం తెలిసిన బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన కరీంనగర్ టూ టౌన్ పోలీసులు.. శిశువు విక్రయాన్ని అడ్డుకున్నారు. శిశువును అమ్మేందుకు సహకరించిన 15 మందిని అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మరోమారు షాక్ ఇచ్చిన బంగారం

## ఒక్కరోజే పది గ్రాములపై 1800 పెరుగుదల



**హైదరాబాద్,నవంబర్22:** బంగారం కొనాలనుకునే వారికి ధరలు వరుస షాక్‌లు ఇస్తున్నాయి. తగ్గినట్టే తగ్గి భారీగా పెరుగుతున్నాయి. బంగారం ధరలుగతం పోల్చుకుంటే శనివారం భారీగా పెరిగాయి. ఒక్క రోజులోనే ఏకంగా పది గ్రాములపై 1800 రూపాయలు పెరిగింది. శుక్రవారం పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,23,980 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 22 క్యారెట్ల బంగారం ధర 1,13,650 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 18 క్యారెట్ల ధర 92,900 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి..పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,25,840 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల ధర 1,15,350 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 18 క్యారెట్ల బంగారం ధర 94,380 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. 100 గ్రాములపై 300, కేజీపై 3 వేల రూపాయలు పెరిగింది. నిన్న(శుక్రవారం) 100 గ్రాముల వెండి ధర 16,100 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,61,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో 100 గ్రాముల వెండి ధర 16,400 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ ధర 1,64,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది.

# పుట్టపర్తి చేరుకున్న రాష్ట్రపతి

## ముర్మకు ఘనంగా స్వాగతం పలికిన సిఎం, మంత్రులు

**పుట్టపర్తి,నవంబర్22 :** సత్యసాయి బాబా శత జయంతోత్సవాలలో పాల్గొనడానికి శనివారం ఉదయం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా, ఐటీ శాఖ మంత్రి లోకేష్, మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రి ఎస్.సవిత, మంత్రి కందుల దుర్గేష్, హిందూపురం ఎంపీ బికే. పార్థసారథి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, పుట్టపర్తి ఎమ్మెల్యే లు కలిసి రాష్ట్రపతికి సాదర స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఉన్న సత్యసాయి బాబా మహాసమాధికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి లోకేష్, తదితరులు నివాళు లర్పించారు. ప్రశాంతి నిలయంలోని ఆలయంలో రాష్ట్రపతి ప్రార్థించారు. వేద పండితులు కలిసి రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ టెస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఆర్.జె.రత్నాకర్, ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సంపాదకీయం

# సుప్రీం తీర్పు.. గవర్నర్ల వ్యవహారం!

పదవీ విరమణ చేయబోతున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధ, గురు వారాల్లో రెండు రాజ్యాంగ ధర్మాసనాలకు నేతృత్వం వహించి తీర్పులిచ్చారు. రాష్ట్రపతి న్యాయ సలహా కోరిన అంశంపై గురువారం ఏకాభిప్రాయంతో తీర్పు సంచలనంగానే పేర్కొనాలి. ఎందుకంటే తమిళనాడు కు సంబంధించిన పలు బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తొక్కిపెడుతుండటంతో అక్కడి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు గవర్నర్‌ను ఆదేశించింది. బిల్లులను తొక్కిపట్టే విధానాన్ని తప్పుబట్టింది. అయితే, గవర్నర్ మాత్రం బిల్లులను ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ ఈ ఏడాది ఏప్రిల్ 8న సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా పది బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టారని ప్రకటించింది. రాజ్యాంగ విధుల్లో విఫలయ్యారని, రాజ్యాంగబద్ధ పాలన కూలిపోయే పరిస్థితి కల్పించారని మండిపడింది. బిల్లులు తిప్పిపంపకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. తిప్పి పంపిన తర్వాత మళ్లీ శాసనసభ ఆమోదిస్తే గవర్నర్ ఆమోదించాల్సిందేనని స్పష్టం చేసింది. గవర్నర్‌కు పంపిన బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మే 13న రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టును 14 ప్రశ్నలతో న్యాయ సలహా కోరింది. వాటికి సుప్రీంకోర్టు గురువారం సమాధానం ఇచ్చింది. వాదనల సమయంలో ఏప్రిల్ 8 నాటి సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చే ఉద్దేశం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పదేపదే చెప్పారు. గురువారం నాటి తీర్పు కాపీలోనూ... మరో తీర్పును తోసిపుచ్చేందుకు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సలహా కోరడాన్ని ఉపకరణంగా వాడటం కుదరదని పేర్కొంది. ప్రత్యేకించి కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు ఆయా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కొంత పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా బిల్లుల ఆమోదం విషయంలో వారు సకాలంలో నిర్ణయం తీసుకోవడం లేదు. లేదా తిప్పి పంపడం లేదు. ప్రధానంగా బెంగాల్, తమిళనాడు, తెలంగాణల్లో ఇలాంటి పరిస్థితులను చూశాం. అయితే రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదంలో గడువు విధించడం తగదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఇటీవలే తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో ఇప్పుడు గవర్నర్ల వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నా ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది. అలాగే బిల్లులను సకాలంలో పంపాలన్న నిబంధన లేకపోతే వారు రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చెలాయిస్తారని తమిళనాడు, బెంగాల్ తదితర రాష్ట్రలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ దీనిపై చర్చించాల్సి ఉంది. గవర్నర్లకు ఉండే వెసలుబాటులోనూ సమయాభావన ఉండాలన్న దానిపై చర్చించాలి. అవసరమైతే చట్టపరంగా మార్పులకు శ్రీకారం చుట్టాలి.అప్పుడే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు ఆమోదం దక్కుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చని కూడా స్పష్టం చేసింది. అయితే, గవర్నర్ ఎటువంటి కారణం చెప్పకుండా నిరవధికంగా ఆలస్యం చేయడం తగదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం అభిప్రాయ పడింది. ఒక బిల్లు గవర్నర్ దగ్గరికి వచ్చినప్పుడు అన్నీ పరిశీలించి సమ్మతి తెలియ జేయడం లేదా ఏదైనా సహేతుకమైన కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం చేయాలి. లేదా బిల్లును తిరస్కరించి తిరిగి అసెంబ్లీకి పంపడం చేయాలి. కానీ చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. తమిళనాడు గవర్నర్ రవి ఇలాంటి నిబంధనలు పక్కన పెట్టారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సమయంలో తమిళిసై సైతం ఇదే ధోరణితో ఉన్నారు. ప్రభుత్వాలు ఏదైనా నిర్ణయం తీసుకుంటే సకాలంలో ఔనని లేదా కాదని చెబితే బాగుండేది. కానీ దానిపై సమాధానం ఇవ్వక పోవడం అన్నది, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేదే తప్ప మరోటి కాదు. అయితే ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో రాజ్యాంగంలోని 200 నిబంధన కింద గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారని, అటువంటి సమయంలో న్యాయస్థానాలు గడువు విధించడం సరికాదని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయ పడింది. ఇకపోతే తన పరిశీలనకు వచ్చిన ప్రతి బిల్లుపై రాష్ట్రపతి రాజ్యాగంలోని 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు సలహా కోరనవసరం లేదు. గవర్నర్లు నిరవధికంగా ఒక బిల్లును తమ వద్ద ఉంచుకోరాదు అనేదే ప్రధానం. అందువల్ల పరిమితమైన న్యాయ సమీక్ష ఉండవచ్చని రాజ్యాంగ ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో అభిప్రాయపడింది. రాజ్యాంగంలో బిల్లును సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ఉన్నప్పటికీ దాన్ని గవర్నర్లకు, రాష్ట్రపతికి డెడ్‌లైన్ పెట్టేందుకు రాజ్యాంగం ఇచ్చిన అనుమతిగా భావించనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. డెడ్‌లైన్ పెట్టి, ఆలోగా ఆమోదం ఇవ్వకపోతే లభించినట్లుగానే భావించడం రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి భంగం కలిగిస్తుందని తెలిపింది. మొత్తంగా గవర్నర్లకు ఇప్పుడు విచక్షణ ఉందని తేల్చింది. అంటే బిల్లులను ఎంతకాలమైనా పెండింగ్‌లో పెట్టుకునే అవకాశం ఉంది. అయితే అది ఎంతకాలం అన్న చర్చ జరగాలి. లేదా దానికి కూడా పరిమిత కాలం అంటూ ఉండాలి. అప్పుడే గవర్నర్ల పెత్తనం అతిగా ఉండదు. తమిళనాడు వ్యవహారం, సుప్రీం తీర్పు నేపథ్యంలో గవర్నర్లకు సంబంధించి తప్పకుండా చర్చచేయాల్సి ఉంది. ఇందుకు పార్లమెంట్ పూనుకోవాలి. ఇలాంటి విషయాల్లో విపక్షపార్టీ సభ్యులు చర్చకు పట్టుబట్టాలి. అప్పుడు సమస్యకు మార్గం దక్కగలదు.

# ప్రపంచ సంరక్షుడిగా హిందూ సమాజం

- హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ప్రమాదం
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్




**ఇంఫాల్, నవంబర్ 22:** ప్రపంచాన్ని నిలబెట్టడంలో హిందూ సమాజం కీలకమని రాష్ట్రీ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ఉనికి ఉండదని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశం అన్ని రకాల పరిస్థితులను చూసిందని, యునాన్ (గ్రీస్) మిస్ర్ (ఈజిప్టు), రోమ్ వంటి సామ్రాజ్యాలు, నాగరికతలు కనుమరుగైనా హిందూ సమాజం చెక్కుచెదరలేదని చెప్పారు. జాతుల మధ్య ఘర్షణలతో ఇటీవల కాలంలో అట్టుడికిన మణిపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడుతూ, హిందూ సమాజం ధర్మానికి ప్రపంచ సంరక్షుడిగా ఉందన్నారు. భారత్ అంటే అమర నాగరికతకు పేరని, సమాజంలో అలాంటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నందునే హిందూ కమ్యూనిటీ చెక్కుచెదరకుండా ఉందని, హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచమే ఉనికి కోల్పోతుందని అన్నారు. ఇండియాలో ఉన్నవారంతా హిందువులేనని, హిందూ వారసత్వానికి చెందినవారే ముస్లింలు, క్రిస్టియన్లని చెప్పారు. దేశ పటిష్టతకు ఆర్థిక స్వావలంభన చాలా కీలకమని మోహన్ భాగవత్ అన్నారు. దేశ నిర్మాణంలో మిలటరీ సామర్థ్యం, నాలెడ్జ్ కెపాసిటీకి సమ ప్రాధాన్యత ఉందని చెప్పారు. దేశ నిర్మాణం జరగలాంటే బలం కావాలని, బలం అంటే ఆర్థిక సామర్థ్యమని చెప్పారు. ఆధిపత్యం అనే పదానికి ఒక్కోసారి విపరీత అర్థం వస్తుందన్నారు. అయితే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎవరిపైనా ఆధారపడకూడదని అన్నారు. ఇదేమంత కష్టమైన పని కూడా కాదని చెప్పారు. నక్సలిజం తగ్గుముఖం పట్టడంపై మాట్లాడుతూ, నక్సలిజాన్ని ఇంకెంత మాత్రం సహించేది లేదని సమాజం నిర్ణయించుకోవడమే ఇందుకు కారణమని అన్నారు. బ్రిటిష్ వారిపై జరిగిన స్వాతంత్య్ర పోరాటాన్ని ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. 'బ్రిటిష్ సామాజ్యంలో రవి అస్తమించడు. కానీ ఇండియాలో వారి సూర్యుడు అప్పటికే అస్తమించాడు. 90 ఏళ్లపాటు ప్రయత్నాలు సాగించాం. అణచివేతకు ఎన్నడూ తలవంచలేదు. కొన్నిసార్లు మన గళం బలహీనంగా ఉండి ఉండవచ్చు, కొన్ని సార్లు బలంగా వినిపించి ఉండవచ్చు. కానీ మన గళం ఎన్నడూ మూగవోలేదు' అని మోహన్ భాగవత్ వివరించారు.

# దేశంలో పేలుళ్లకు జైషే కుట్రలు

## ఆత్మాహుతి బాంబర్ ఉమర్‌కు నిధులు

## డాక్టర్లే నిధులు సమకూర్చారని గుర్తింపు



**న్యూఢిల్లీ, నవంబర్ 22:** ఢిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరమవుతున్న కొద్దీ పలు కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. జైషే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ దేశవ్యాప్తంగా దాడులకు 2023 నుంచి కుట్రలు పన్నుతున్నట్టు సమాచారం ఇప్పటికే వెలుగులోకి రాగా, ఢిల్లీ పేలుడు కేసులో నిందితులుగా ఉన్న డాక్టర్లే స్వయంగా సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్‌కు నిధులు సమకూర్చినట్టు తాజాగా వెలుగుచూసింది. కేసులో నిందితులైన డాక్టర్లంతా కలిసి రూ.26 లక్షలు సమకూర్చినట్టు తెలుస్తోంది. డాక్టర్ ముజమ్మిల్ రూ.5 లక్షలు, డాక్టర్ అదిల్ అహ్మద్ రాథర్ రూ.8 లక్షలు, డాక్టర్ ముఫర్ అహ్మత్ రాథర్ రూ.6 లక్షలు, డాక్టర్ ఉమర్ రూ.2 లక్షలు, డాక్టర్ షహీన్ సాహిద్ రూ.5 లక్షలు కంటిబ్యూట్ చేసినట్టు చెబుతున్నారు. పోగుచేసిన మొత్తం సొమ్మును పేలుడు సామగ్రిని సమకూర్చేందుకు డాక్టర్ ఉమర్‌కు వీరు అందజేశారని దర్యాప్తు అధికారుల సమాచారం. అమ్మోనియం నైట్రేట్, యూరియా, ఇతర కీలక సామగ్రిని డాక్టర్ ముజమ్మిల్ సేకరించాడు. రూ.3 లక్షలతో ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను కొనుగోలు చేశాడు. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఫరీదాబాదాలోని రెండు మార్కెట్ల నుంచి కొన్నాడు. ఆ ఫెర్టిలైజర్‌ను పేలుడు పదార్ధాలుగా డాక్టర్ ఉమర్ మహమ్మద్ మార్చాడు. పేలుడుకు అవసరమైన రసాయనాలు, రిమోట్లు, అవసరమైన పరికరాలను సమకూర్చే బాధ్యత డాక్టర్ ఉమర్ తీసుకున్నాడు. మరోవైపు, అల్-ఫయిదా యూనివర్శిటీ వ్యవహారంపై విస్తృతంగా జరిపిన ఇన్వెస్టిగేషన్‌లో ల్యాబ్ నుంచి స్టూడెంట్ ప్రాజెక్టుల పేరుతో పలు కెమికల్స్, గ్లాస్‌వేర్ చోరీ అయినట్టు తెలుస్తోంది. అమ్మోనియం నైట్రేట్, టెస్టింగ్ కిట్లు మాయమైనట్టు గుర్తించారు. నిందితులు చిన్న చిన్న మొత్తాల్లో వీటిని బ్యాగులు, వాహనాల్లో యూనివర్శిటీ నుంచి తరలించినట్టు గుర్తించారు.

# నేడు భారత్ బంద్

## మావోయిస్టుల పిలుపు.. • అప్రమత్తం అయిన పోలీసులు



**విజయవాడ, నవంబరు 22:** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా ఎన్‌కౌంటర్‌కి నిరసనగా ఆదివారం దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తూ పార్టీ ప్రతినిధి అభయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన రాసిన లేఖలో.. నిరాయుధులైన హిడ్మా, అతడి భార్య రాజే సహా ఆరుగురు మావోయిస్టులను ఏపీ పోలీసులు విజయవాడలో అదుపులోకి తీసుకుని ఆ తరువాత మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో కాల్చి చంపి, దానిని ఎన్‌కౌంటర్‌గా చెప్పుకున్నారని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా చికిత్స కోసం విజయవాడకు వచ్చారని, విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఎస్ఐబీ పోలీసులు అతన్ని పట్టుకుని.. 15న అరెస్ట్ చేసి, 18వ తేదీన హిడ్మాను బుటకపు ఎన్ కౌంటర్ చేశారని మావోయిస్ట్ పార్టీ ప్రతినిధి అభయ్ ఆరోపించారు. అలాగే, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీ సంఘం సీనియర్ నాయకుడు మనీష్ కుంజా కూడా ఈ ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండించారు. తాడిమెట్ల, జీరంఘాట్ ఘటనల్లో మాద్వి హిడ్మా ప్రమేయం లేదని పేర్కొన్నారు. ఆంధ్రాకు చెందిన కొంత మంది పార్టీకి చెందిన నాయకులే హిడ్మా కదలికలపై పోలీసులకు సమాచారం ఇచ్చారు.. ఈ ఎన్‌కౌంటర్‌లో దేవ్‌జీ పాత్ర ఉందని తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కాగా, ఈ ఎన్ కౌంటర్ ని వ్యతిరేకిస్తూ మావోయిస్టులు పెద్ద ఎత్తున నిరసనకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే భారత్ బంద్‌కి పిలుపునివ్వడంతో.. భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పలుచోట్ల పోలీసు బందోబస్తు కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీ ఏరియాలో పోలీసులు అలర్ట్ అయ్యారు. ప్రజా ప్రతినిధులు ఏజెన్సీ ప్రాంతాలను విడిచి మైదాన ప్రాంతాలకు వెళ్లాలని పోలీసులు సూచనలు చేశారు.

# పార్టీకి తెలయచేసి లొంగిపోయాం

## ఇప్పుడున్న స్థితిలో ఇక ఉద్యమించలేం: ఆజాద్

**హైదరాబాద్,నవంబరు 22:** మేం పార్టీకి చెప్పే లొంగిపోయామని మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబయ్య అలియాస్ ఆజాద్ తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టు పార్టీ పిలుపునిస్తుందని పేర్కొన్నారు. స్టేట్ కమిటీలో ఉన్న ఇంకా ఇద్దరు అగ్రనేతలు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. తామంతా జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని నిర్ణయం తీసుకున్నామని దండకారణ్యం స్పెషల్ జోన్ సభ్యుడు ఎర్రా తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లో ఉద్యమాన్ని నడిపించడం కష్టమని పేర్కొన్నారు. మా ఆరోగ్య పరిస్థితులు కూడా సహకరించడం లేదని చెప్పారు. మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోవడం మంచిదని పిలుపునిచ్చారు.



# ఢిల్లీ పేలుళ్ల కేసులో ముమ్మర దర్యాప్తు

## శ్రీనగర్‌లో మరొకరి అరెస్ట్

శ్రీనగర్, నవంబర్ 22: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ పేలుడు ఘటనలో దర్యాప్తు బృందాల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. జైషే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కేసుకు సంబంధించి శ్రీనగర్ నివాసి ఒకరిని జమ్మూకశ్మీర్ పోలీస్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ శనివారంనాడు అరెస్టు చేసింది. బతమలూ ఏరియాకు చెందిన ఇతనిని తుఫైల్ నియాజ్ భట్‌గా గుర్తించారు.గత అక్టోబర్‌లో నౌగామ్‌లోని బన్‌పోరలో పోలీసులు, భద్రతా సిబ్బందిని బెదిరిస్తూ పోస్టర్లు వెలిసాయి. దీనిపై శ్రీనగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించడంతో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ వెలుగు చూసింది. శ్రీనగర్ సీనియర్ ఎస్పీ డాక్టర్ జీవీ సుందీప్ చక్రవర్తి ఈ విచారణను పర్యవేక్షించి, సీసీటీవీ అనాలసిస్ చేపట్టడంతో మొదటి ముగ్గురి అనుమానితులు పట్టుబడ్డారు. ఆరిఫ్ నసీర్ దర్ అలియాస్ సాహిల్, యాసిర్ ఉల్ అష్రాఫ్, మక్సూద్ అహ్మద్ దర్ అలియా షాహిద్‌లను అరెస్టు చేశారు. వీరిని విచారించిన దర్యాప్తు సంస్థలు ఇర్ఫాన్ అమ్మద్ అనే మరో వ్యక్తిని పట్టుకున్నారు. అతను గతంలో పారామెడిక్‌గా పనిచేసి ఇమామ్‌గా మారాడని, పోస్టర్లు సరఫరా చేయడంతో పాటు డాక్టర్లను రాడికల్స్‌గా మార్చినట్టు గుర్తించారు. క్రమంలోనే ఫరీదాబాద్‌లోని అల్ ఫయిదా యూనివర్శిటీలో సోదాలు నిర్వహించారు. డాక్టర్ ముజఫర్ గనాయే, డాక్టర్ షహీన్ సయీద్‌లను అరెస్టు చేసి 2,900 కిలోల పేలుడు పదార్ధాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ గనాయ్, కారు పేలుడులో చనిపోయిన సూసైడ్ బాంబర్ ఉమర్ నబి, ముజఫర్ రాథెర్‌లతో కూడిన కోర్ గ్రూప్ ఈ పేలుడు కుట్రకు ప్రధాన కారణమని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ముజఫర్ రాథెర్ పరారీలో ఉన్నాడు.



# సేవే ధర్మం.. ప్రేమే మార్గం

మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు నాయుడు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనే ఈ ఐదు సూత్రాలను సత్యసాయి బాబా చెప్పేవారని గుర్తు చేశారు. సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు.. సూత్రాలను పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుందన్నారు. ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారన్నారు. కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు... పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి తాగు నీటి ప్రాజెక్టులకు నిధులను సమకూర్చారని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. ఇప్పటికీ అదే స్ఫూర్తిని సత్యసాయి బాబా భక్తులు కొనసాగించడం తనకు సంతోషాన్ని ఇస్తోందన్నారు. సత్యసాయి బాబాతో తనకు మంచి అనుబంధం ఉందని సీఎం గుర్తుచేశారు. వివిధ ప్రాణాంతక రోగాల బారిన పడిన వారిని సత్యసాయి బాబా ట్రస్టు ఆదుకుంటోందని సీఎం పేర్కొన్నారు. మానవ సేవే... మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని సత్యసాయి బాబా ట్రస్టు అమలు చేసి చూపిస్తోందన్నారు. శాంతికి బ్రాండ్ అంబాసిడర్ లాగా సత్యసాయి బాబా నిలుస్తారని చెప్పుకొచ్చారు. 7.50 లక్షల మంది వాలంటీర్లు సత్యసాయి బాబా ట్రస్టు ద్వారా సేవలందించారని... ఏ వ్యవస్థకు ఇంతటి శక్తి లేదన్నారు. ఇవాళ సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రొగ్రాం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఏమైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవలందిస్తారన్నారు.



ధనవంతులు, పెద్ద ఉన్నతాధికారుల కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రశాంతి నిలయానికి పంపి సేవా కార్యక్రమాలు చేయిస్తారన్నారు. 140 దేశాల్లో 2 వేలకు పైగా బ్రాంచ్‌లు సత్యసాయి బాబా ట్రస్టుకు ఉన్నాయన్నారు. భగవాన్ సత్యసాయి బాబా భక్తులు శాంతికి అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రపతి ముర్ము జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## అరటి రైతులను ఆదుకునేందుకు ముంబైకి రైల్వే వ్యాగన్లు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో అరటి, పత్తి, మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. ధరల పతనం, కొనుగోళ్లలో జాప్యం వంటి అంశాలపై ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించి, రైతులను ఆదుకునేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రాయలసీమ అరటి రైతులు, రాష్ట్రవ్యాప్తంగా పత్తి, మొక్కజొన్న రైతులు నష్టపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**రైళ్లలో ముంబైకి రాయలసీమ అరటి**

రాయలసీమలో సుమారు 40 వేల హెక్టార్లలో పండుతున్న అరటికి సరైన ధర లభించకపోవడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. డిసెంబరు మొదటి వారం నుంచి ధరలు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పగా, అప్పటివరకు రైతులను నష్టపోనివ్వకూడదని సీఎం స్పష్టం చేశారు. రాయలసీమ అరటిని ముంబై, కలకత్తా వంటి ప్రధాన మార్కెట్లకు రైల్వే వ్యాగన్ల ద్వారా తరలించేందుకు తక్షణమే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందుకు ఓ ఏజెన్సీ ముందుకు వచ్చిందని అధికారులు తెలపగా, రవాణాకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అరటి ధరలు, కొనుగోళ్లపై వ్యాపారులతో ప్రతిరోజూ సమావేశాలు నిర్వహించి, మార్కెట్‌ను నిరంతరం పర్యవేక్షించాలని ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

**మొక్కజొన్న, పత్తి రైతులను ఆదుకునేందుకు చర్యలు**

మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన దుస్థితి నుంచి మొక్కజొన్న రైతులను గట్టెక్కించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ధరల వ్యత్యాసాన్ని ధరల స్థిరీకరణ నిధి ద్వారా చెల్లించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఈసారి 8.18 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేయగా, మార్క్‌ఫెడ్ ద్వారా 2.04 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రయోగాత్మకంగా ఇతర ఏజెన్సీలతో కొనుగోళ్లు చేపట్టాలని పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. రానున్న వర్షాల దృష్ట్యా కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రంగుమారిన, తడిచిన పత్తిని కూడా కొనుగోలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిబంధనలైన తేమ శాతం వంటి కారణాలతో రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. సీఎం సూచనలతో స్లాట్ బుకింగ్ సమస్య పరిష్కారమైందని అధికారులు వివరించారు. కొనుగోలు కేంద్రాలను ప్రతిరోజూ తనిఖీ చేస్తూ, రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

## విశ్వప్రేమకు ప్రతిరూపం సత్యసాయి

### సాయి బోధనలు లక్షల మందికి మార్గనిర్దేశనం

### పుట్టపర్తి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము



**పుట్టపర్తి :** సత్యసాయి మహాసమాధిని దర్శించు కోవడం తన అదృష్టమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నిర్వహించిన శ్రీసత్యసాయి శత జయంతి వేడుక ల్లో ఆమె పాల్గొన్నారు. సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న అనతంరం రాష్ట్రపతి ప్రసంగించారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. ఆయన బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. ఆయన సందేశంతో కోట్ల మంది భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపు తున్నానని రాష్ట్రపతి అన్నారు. పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందని ప్రభావితం చేశాయని అన్నారు. లక్షలాది మందికి మార్గం చూపాయని వ్యాఖ్యానించారు. పుట్టపర్తికి వచ్చిన రాష్ట్రపతికి సీఎం, మంత్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తిలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారని కొనియాడారు. బాబా సందేశంతో కోట్లాదిమంది భక్తులు మానవ సేవ చేస్తున్నారని ప్రశంసించారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారని కీర్తించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు ఆమె వెంట ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు. అంతకుముందు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి చంద్రబాబు, లోకేశ్ ఘన స్వాగతం పలికారు.

## సత్యసాయి ఆశిస్సులతో అగ్రస్థానానికి భారత్




మొదటి పేజీ తరువాయి

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నవంబర్ 22 విశిష్టత గురించి సీఎం చెప్పగానే వస్తానని చెప్పా. ఇప్పటికే దేశంలో ముగ్గురు ప్రముఖులు పుట్టపర్తిని సందర్శించారు. సమాజ సేవ కోసం సత్యసాయిబాబా నాయకులను తయారు చేశారు. విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని లోకేశ్ ఆహ్వానించగానే అందరూ స్వాగతించారు. విద్యార్థులు దేశ నాయకులుగా ఎదుగుతారనేందుకు ఇదే నిదర్శనం. జీవితంలో ప్రతి రోజూ చాలా కీలకం. మానవ జీవితాలు యాంత్రికంగా, ఆధ్యాత్మికంగా సాగుతున్నాయి. విద్యాసంస్థ ద్వారా క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం నేర్పుతున్నారు. విద్యార్థులకు నైతిక విలువలు నేర్పే కేంద్రంగా సత్యసాయి విద్యాసంస్థ విలసిల్లుతోందని ఉప రాష్ట్రపతి అన్నారు. అంతకుముందు శ్రీ సత్యసాయి శతజయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. సత్యసాయి మహా సమాధి వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ తదితరులు ఉన్నారు. అనంతరం.. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు.వ్యక్తిత్వ కేంద్రంగా సత్యసాయి వర్సిటీ నిలుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'సత్యసాయి వర్సిటీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ప్రత్యేక ఆశయంతో సత్యసాయిబాబా భూమిపైకి వచ్చారు. సత్యసాయి.. భగవాన్ సాయి సిద్ధాంతం వ్యాప్తి చేశారు. క్రమశిక్షణ, ప్రేమ, సేవాభావం కలిగి ఉండాలని చెప్పారు. భారత్.. వేల ఏళ్లుగా ఆధ్యాత్మిక భావనలతో వర్ధిల్లుతోంది. వసుధైక కుటుంబం.. ప్రపంచమంతా ఒకే కుటుంబం అనేది మన సంస్కృతిలో ఉంది. సత్యసాయి విద్యాసంస్థ నైతికత, విలువలతో కూడి ఉంటుంది. విద్యార్థులకు ఆధ్యాత్మికత, సేవాభావాన్ని విద్యాసంస్థ నేర్పిస్తుంది. అందరినీ ప్రేమించాలి.. సేవ చేయాలి అనేది భగవాన్ సాయి సిద్ధాంతం. సహాయ గుణం కలిగి ఉండాలే కానీ, ఎవరినీ నొప్పించవద్దనేది సిద్ధాంతం. సత్యం, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు సూత్రాలు చెప్పారని సీఎం అన్నారు.

## రాజధాని రైతులకు పూర్తి న్యాయం

మొదటి పేజీ తరువాయి




పేర్కొన్నారు.రాజధాని ప్రాంత రైతుల సమస్యలపై సమావేశంలో చర్చించామని మంత్రి నారాయణ తెలిపారు. ఖచ్చితంగా ఆరు నెలల్లో రైతుల సమస్యలకు పరిష్కారం వస్తుందన్నారు. కోర్టు కేసులు.. ఇతర కారణాల వల్ల ఆలస్యం అయిందని చెప్పారు. ఒకరిద్దరు వాళ్ల స్వార్థం కోసం చెప్పే అంశాలను నమ్మవద్దని మంత్రి అన్నారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై సీఆర్డీఏ కీలక సమావేశం నిర్వహించింది. రాజధానిలోని సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ భేటీ అయ్యింది. ఈ కమిటీలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఉన్నారు. సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ముఖ్య అధికారుల తో కమిటీ సమావేశమైంది. దీనికి రైతు జేఏసీ ప్రతినిధులు హాజరయ్యారు. రైతులు లేవనెత్తిన అంశాలపై పరిష్కారం దిశగా కమిటీ సమాలోచనలు చేసింది. గతంలో జగన్ ప్రభుత్వ తీరు వల్ల రాజధానిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సమస్యలన్నీ పరిష్కరించాలని తమ కమిటీకి సీఎం సూచించారని తెలిపారు. రాజధానిలో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. జరీబు భూముల సమస్యకు 30 రోజుల్లో పరిష్కారం చూపిస్తాం. సీఆర్డీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జరీబు భూములను గుర్తిస్తారు. గ్రామ కంఠాల సమస్య కూడా పరిష్కరిస్తాం. లంక భూముల సమస్యను జగన్ జఠిలం చేశారు. దీనిపై వైకాపా నేతలు కోర్టులో కేసులు వేశారు. అసైన్డ్ భూములను కొందరు అమ్ముకుంటే జగన్ ప్రభుత్వం తప్పుబట్టి ఆపేసింది. మిగతా ప్రాంతాల్లో అసైన్డ్ చట్టానికి, రాజధానిలో అసైన్డ్ భూములకు వ్యత్యాసం ఉంది. ఈ సమస్య పరిష్కారానికి మూడు నెలల సమయం పడుతుంది. 90 శాతం రైతులకు ఎ÷-లాట్ల కేటాయింపు పూర్తయింది. రాబోయే 15 ఏళ్లలో జనాభా పెరుగుదల అంచనాల ప్రకారం మౌలిక వసతులు కల్పిస్తాం. 20 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. వచ్చే జూన్ నాటికి రాజధాని గ్రామాల్లో తాగునీరు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేస్తాం, మరో వారం తర్వాత త్రిసభ్య కమిటీ సమావేశం అవుతుందని పెమ్మసాని అన్నారు. రాజధాని రైతుల సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించిన కమిటీ శనివారం భేటీ అయ్యిందన్నారు.అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాజధాని కోసం 30 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారన్నారు. ఇంత మంది రైతులు ఉన్నప్పుడు అనుకున్నంత వేగంగా అన్నీ జరగవని చెప్పుకొచ్చారు. 700 ఎకరాల భూమిలో రైతులకు సమస్యలు ఉన్నాయని.. వీటిలో వివిధ కారణాలతో సమస్యలు వచ్చాయని తెలిపారు. సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలని భేటీలో చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా జరిబు ల్యాండ్ సమస్యల విషయంలో నిజమైన జరిబు రైతులకు న్యాయం చేస్తామని వెల్లడించారు. దీనిలో కూడా 180 ఎకరాల్లో మాత్రమే సమస్య వచ్చిందని.. 30 రోజుల్లో నిజనిర్ధారణ చేసి పరిష్కారం చేస్తామని కేంద్రమంత్రి తెలిపారు. గ్రామకంఠాల విషయంలో గైడ్ లైన్స్ పాటించకుండా చేసినందు వల్ల 36 ఎకరాల్లో సమస్యలు వచ్చాయని కేంద్రమంత్రి వివరించారు. గ్రామ కంఠాలలో ఎవ్వరికైనా ఎక్కువ ఇచ్చినట్టు గుర్తిస్తే వాటిపై రీ సర్వే చేస్తామన్నారు. 30 రోజుల్లో అడిషనల్ కమిషనర్ రిపోర్ట్ తీసుకొని పరిష్కరిస్తామన్నారు. అసైన్డ్ ల్యాండ్స్ విషయంలో, జగన్ వచ్చాక లంక భూముల విషయంలో కోర్టు చిక్కులు ఏర్పడ్డాయని అన్నారు. అసైన్డ్ ల్యాండ్స్ విషయంలో అమ్ముకునే అవకాశం ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వం కుదరదని చెప్పడంతో ఇబ్బందులు వచ్చాయన్నారు. 90 శాతం మందికిపైగా రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చేసినట్లు తెలిపారు. గ్రామాల వారీగా అభివృద్ధికి 20 రోజుల్లో 25 గ్రామాలకు డీపీఆర్ సిద్ధం చేస్తామన్నారు. 2026 జూన్ నాటికి గ్రామాల్లో మౌలికవసతులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. లే ఔట్‌లు ఇచ్చిన చోట సరిహద్దు రాళ్ళు పోయాయన్నారు. దీంతో డిసెంబర్ 5 నుంచి సరిహద్దు రాళ్ళ సమస్య పరిష్కరిస్తామన్నారు. అపోహలు నమ్మొద్దని రైతులకు చెబుతున్నామని.. రెండు వారాలకు ఒకసారి ఈ కమిటీ సమావేశమవుతుందని తెలిపారు. సమస్యలన్నింటినీ ఆరు నెలలలోగా పరిష్కరిస్తామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలో ఉన్న లే ఔట్లలో సరిహద్దు రాళ్లు వేయాలని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం రెండు వైపుల మాత్రమే సర్వే రాళ్లు వేయగలిగామన్నారు. డ్రైనేజ్ వ్యవస్థ సెట్ అయ్యాక మిగిలిన రెండు వైపులా సర్వే రాళ్లు వేస్తామని చెప్పారు. రాజధాని గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న పైప్ లైన్లు పనికి రావని.. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ రావాలని తెలిపారు. రాజధాని గ్రామాల్లో శ్మశానాలు లేవన్నారు. మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని అన్నారు. త్వరలో డీపీఆర్ రెడీ చేస్తామని.. డీపీఆర్ తయారు చేశాక గ్రామ సభలు పెట్టి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు.

## ఐదేళ్లు నిద్రపోయి ఇప్పుడు లేచావా




మొదటి పేజీ తరువాయి

ప్రశ్నించారు. జలవనరులపై ఇప్పుడు ప్రదర్శిస్తున్న కపట ప్రేమ అధికారంలో ఉన్నప్పుడు ఏమైందని మండిపడ్డారు. కేవలం రాజకీయంగా పబ్బం గడుపుకునే చర్య తప్ప మరోటి కాదన్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఏపీ వాటాగా 512 టీఎంసీలు, తెలంగాణ వాటాగా 299 టీఎంసీలు వాడుకునే విధంగా రాష్ట్ర ప్రయోజనాల ను కాపాడింది చంద్రబాబేనని గుర్తు చేశారు. 2020 లో అక్టోబర్‌లో అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఏపీ ప్రాజెక్టుల నీటి వాడకంపై పునఃసమీక్ష చేయాలని అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ కోరారు. ఆ భేటీలో జగన్ మౌనంగా ఉండి రాష్ట్రానికి అన్యాయం చేశారు. కృష్ణా జలాల ట్రైబ్యునల్-2 గెజిట్ నోటిఫికేషన్ 2023లో విడుదలైంది. అంటే అపెక్స్ కౌన్సిల్ భేటీలో తీసుకున్న నిర్ణయం ఆమోదానికి మూడేళ్లు పట్టింది. భేటీ తర్వాత మూడేళ్లపాటు జగన్ పట్టించుకోలేదు. గెజిట్ నోటిఫికేషన్‌కు ముందే సుప్రీం కోర్టులో జగన్ ఎందుకు రిట్ పిటిషన్ దాఖలు చేయలేదన్నారు. 2023 అక్టోబర్ 6న గెజిట్ నోటిఫికేషన్ వచ్చిన రోజునే ప్రధానిని కలిసి రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్లుతోందని ఎందుకు అభ్యంతరం చెప్పలేదు? 2014-19 మధ్య కాలంలో రాయలసీమకు రూ.12 వేల కోట్లు ఖర్చు పెడితే.. 2019-24 మధ్య కాలంలో కేవలం 2వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి జగన్ దగా చేశారు. 5 ఏళ్లలో చేయలేని హంద్రీనీవా పనులకోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రూ.3860 కోట్లు ఖర్చు చేసింది. మండు వేసవిలోనూ రాయలసీమలోని జలాశయాలు జలకళతో ఉండటం చంద్రబాబు కృషికి నిదర్శనమని రామానాయుడు అన్నారు.

## మరో 11 కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం

మొదటి పేజీ తరువాయి

స్టేట్ అడ్వైయిజరీ ఆన్ చైల్డ్ లేబర్ చైర్మన్ గా వేటుకూరి ఏవీఎస్ సత్యనారాయణ రాజు,ఏపీ అఫిషియల్ ల్యాంగ్వేజెస్ కమిషన్ చైర్మన్ గా విక్రమ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ గా మౌలానా షిబిలి (విజయవాడ),ఏపీ ఫిషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటి ఫెడ్ రేషన్ చైర్మన్ గా యాతగిరి రాంప్రసాద్ (కడప),పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటి చైర్మన్ గా చిరుమామిళ్ల మదుబాబు (మాచర్ల), ఏపీ స్టేట్ రెడ్డిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ గా కొండా శంకర్ రెడ్డి (ఇచ్ఛాపురం), ఏపీ కుర్ని, కరికాల భక్తుల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా మిన్నప్ప (యమ్మిగనూరు), ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ చైర్మన్ గా ముక్తియార్ (పొద్దుటూరు), ఏపీ బట్రాజు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ గా సరికొండ వెంకటేశ్వరరాజు (సత్తెనపల్లి), ఏపీ స్టేట్ పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ గా వనపర్తి వీరభద్రరావు (పత్తిపాడు) నియమితులయ్యారు.

# గజ్వేల్ ప్రాంతంలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి

● కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ గారికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 22 :** గజ్వేల్ ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రిని, కార్యాలయం ఏర్పాటు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ కి వచ్చిన కార్మిక మరియు ఉపాధి శాఖ మాత్యులు, సిద్దిపేట జిల్లా ఇన్చార్జి వివేక్ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో సుమారు 200 పైగా పరిశ్రమలు ఉన్నాయని వీటి పరిధిలో సుమారు 50వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని, వీరు కాకుండా మున్సిపల్ ప్రైవేట్ సంస్థలో పనిచేసే కార్మికులు ఈ ఎస్ఐ పరిధిలో ఉన్నారని అన్నారు ప్రతినెలా కార్మికుల జీతాల నుండి ఈఎస్ఐ కార్పొరేషన్కు లక్షల రూపాయలు జమవుతున్న కార్మికుల ప్రయోజనం మాత్రం సున్నా అని అన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్లాలంటే సంగారెడ్డి మియాపూర్ 200 కిలోమీటర్ల దూరం అన్నారు. సిద్దిపేట జిల్లాలో ఈఎస్ఐ కార్యాలయం, ఆసుపత్రి లేవని అన్నారు దీంతో కార్మికులు వైద్యం కు ప్రైవేట్ ఆస్పత్రిలో చేయించుకుంటున్నారని, ఈఎస్ఐ ద్వారా లబ్ధి పొందే సంక్షేమ పథకాలు, వేతనంతో కూడిన సెలవులు కోల్పోవడం జరుగుతుందని రెండు విధాల ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుంది అని అన్నారు. జిల్లా కార్మిక మంత్రి ఇన్చార్జి కాబట్టి ప్రత్యేక చొరవ తీసుకుని ఈఎస్ఐ కార్యాలయము ఆసుపత్రిని ఏర్పాటు చేసి కార్మిక కుటుంబాలను కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఐలయ్య రాజు శివయ్య సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కార్మిక కోడ్ చట్టాలను రద్దు చేయాలి

● కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే నూతన కార్మిక కోడులు

● సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 22 :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత కార్మిక వర్గాన్ని కార్పొరేట్ కంపెనీలకు బానిసలుగా మార్చే విధంగా నూతన కార్మిక కోడులను దేశంలో అమలు చేస్తుందని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని విమర్శించారు. నూతన కోడ్ల అమలును నిరసిస్తూ రానే మద్రాస్ లిమిటెడ్ పరిశ్రమ గేటు వద్ద నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం స్వతంత్రం రాక ముందు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడి 29 కార్మిక చట్టాలను సాధించుకుంటే పార్లమెంట్లో ఎలాంటి చర్చ జరపకుండా స్థాయి సంఘాలు ఏర్పాటు చేయకుండా భారత కార్మిక వర్గం భద్రతను వదిలేసి కార్మిక శాఖ, ఇన్స్పెక్టర్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కౌంటర్ బోర్డు అధికారలను తొలగించింద ని అన్నారు. పర్మినెంట్ కార్మికుల అనే విధానం లేకుండా ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో కార్మికులను రిక్రూట్మెంట్ చేసుకోవచ్చని కోడూలో ఉందని అన్నారు కార్మిక రక్షణ కవచాలను ఈ ఎస్ ఐ,పి ఎఫ్ యజమానుకు వదిలి వేసిందని అన్నారు. రైతాంగ పోరాటం స్ఫూర్తి తీసుకొని నూతన కార్మిక కోడ్ చట్టాలను రద్దు చేసే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ చంద్రశేఖర్ రెడ్డి వెంకట్రావు బిక్షపతి సాజిద్ యాదగిరి ఎల్లయ్య రంగు శ్రీనివాస్ ఎన్ లక్ష్మణ్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సైలెన్సర్లను తొలగించి ట్రాఫిక్ పోలీసుల జరిమానా



**ఖమ్మం నవంబర్ 22 : ( సమయం న్యూస్ )** జిల్లా కేంద్రమైన ఖమ్మం నగరంలో శనివారం మో డిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన బుల్లెట్ వాహనాల సైలెన్సర్లను తొలగించి, జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం నగరంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మోడి ఫైడ్ సైలెన్సర్లతో నడిపే బుల్లెట్ వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.కొందరు యువకులు వాహనాలకు సంబంధిత సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్పుచేసి.. వింత శబ్దం, అగ్ని మంట వచ్చే వాటిని అమర్చి, రోడ్లపై అకస్మాత్తుగా వింత శబ్దాలు చేయడం, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం జరుగుతున్న నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈరోజు 20 మోడిఫైడ్ సైలెన్సర్ల వరకూ తొలగించి, ఒక్కో వాహనదారుడికి రూ.1,000 జరిమానా విధించారమని తెలిపారు. ఇప్పటికే సుమారు1000మోడిఫైడ్ సైలెన్సర్ల వరకు తొలగించడం జరిగిందని తెలిపారుర్యక్రమంలో ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఆర్ఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.

# రెండో ప్రపంచ యుద్ధ సమయంలోనే ఎంప్లాయి మెంట్ ఆఫీస్ ఆవిర్భావం

● గత చరిత్ర అంతా ఘన మే

● ప్రస్తుతం 20 వేల 153 ఉపాధి కల్పన రిజిస్ట్రేషన్లు

● జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్

● ( సమయం ఇంటర్వ్యూలో ...)



**ఖమ్మం నవంబర్ 22** :రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో ఎంప్లాయిమెంట్ కార్యాలయం బ్రిటిష్ ప్రభుత్వ హయాంలోనే స్థాపితం అయిందని , ప్రాథమికంగా ఆనాటి యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో రిక్రూట్మెంట్ , ఉద్యోగ అవశ్యకత కలిగిన చదువుకున్న యువత రిజిస్ట్రేషన్ , ఉపాధి కల్పనఉద్దేశం తో ఈ కార్యాలయం పురుడు పోసుకుందని , గత 25 సంవత్సరాలు క్రితం అనగా2000 వ సంవత్సరంవరకు ఎంప్లాయి మెంట్చరిత్ర అంతాఘన చరిత్రే అంటూ ఖమ్మం జిల్లా ఉపాధి కల్పన అధికారికొండపల్లి శ్రీరామ్ .... సమయం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి యం డి. షఫీ యు జమ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో..... ఎంప్లాయి మెంట్ కార్యాల యం గురించి అనేక విశేషాలను వెల్లడించారు. పార్లమెంటు చట్టం ప్రకారం ఎంప్లాయి మెంట్ కార్యకలాపాలు ఉంటాయని , దేశంలోని ప్రతి రాష్ట్రంలో , ప్రతి జిల్లాలో ఎంప్లాయ్ మెంట్ ఆఫీసులు ఉన్నాయని , తమ కార్యలప రాష్ట్ర, కేంద్ర పెత్తనం ఉంటుందని , తమ రిజిస్ట్రేషన్ నివేదికలు కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంటామని జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలుపుతూ .... మొదట ఎంప్లాయ్మెంట్ లో రిజిస్టర్ అయిన సీనియార్టీ ప్రకారం ఉపాధి కల్పన జరుగుతున్న సమయంలో సుప్రీం తీర్పు అనంతరం సీనియారిటీ తోపాటు మెరిట్ ను కూడా ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. ఒకానొక సమయంలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగాల భర్తీలు తమ ఉపాధి కల్పన కార్యాలయం జరుగుతుండగా 2000 వ సంవత్సరం మొదలు ఈ భర్తీల ప్రక్రియ అనేక రకాల రిక్రూట్మెంట్ ఏజెన్సీల ద్వారా చేపట్టడం , ప్రారంభించ బడి , ప్రస్తుతం కొనసాగుతోందన్నారు. నేడు నామమాత్రంగా ఎంప్లాయ్మెంట్ కార్యాలయం కార్యాకలాపాలు సాగుతున్నప్పటికీ ... ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పనకు పాటుపడుతూ , జాబ్ మేళా ద్వారా ఎంప్లాయి మెంట్ కార్యాలయం పనిచేస్తునే ఉందన్నారు. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు , మూడు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయించుకోవాల్సి ఉండేది. ప్రస్తుతం ఒకసారి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారికి 54 సంవత్సరాల వయసు వచ్చేవరకు రెన్యువల్ అవకాశం లేదని , ఉపాధి కల్పనకు వయసు కూడా కట్ ఆఫ్ 54 సంవత్సరాల వయసు వరకు విధించడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం ఇప్పటికీ 12 00 నుండి 1500 వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగు తున్నాయి అన్నారు. ప్రస్తుతం 20వేల 153 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ప్రస్తుతం వరకు తమ ఉపాధి కల్పన కార్యాలయం సుమారు 5000 మందికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఒక ప్రశ్నకు సమాధానంగా .... కొత్తగా ఐటీ రంగం పుట్టుకొని రావడం , ప్రభుత్వ రంగంలో అనేక రిక్రూట్మెంట్ ఏజెన్సీలు రావడం కారణంగా ఉపాధి కల్పన కార్యాలయం కొద్దిగా కుదేలు అయినా ... స్థిరంగా నిలబడి ఇప్పటి కీ సేవలందిస్తుందన్నారు. ప్రాథమిక ఉద్దేశ ఆలోచనల ప్రకారమే ఎంప్లాయి మెంట్ కార్యాలయం పనిచేస్తునే ఉందని తన ఇంటర్వ్యూ ముగించారు కొండపల్లి శ్రీరామ్.

# మహిళాభివృద్ధికి పెద్దపీట వేసిన ప్రజా ప్రభుత్వమిది

● ప్రభుత్వ పథకాలన్నీ మహిళల పేరిటే అమలు.

● మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి.

● మక్తల్ లో అట్టహాసంగా ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ.








**మక్తల్ మండలం,నవంబర్,22(సమయం న్యూస్) :** మహిళలు ఆత్మ గౌరవంతో బ్రతకాలని, మహిళాభివృద్ధి తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే రాష్ట్రంలో ప్రవేశ పెడుతున్న ప్రతీ సంక్షేమ పథకం మహిళల పేరిట అమలు చేస్తున్నామని రాష్ట్ర పశు సంవర్ధక,పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారన్నారు. అందులో భాగంగానే మహిళలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫా%శీ%ల బాధ్యత, ఉచిత బస్ ప్రయాణం, మహిళలకు పెట్రోల్ పంపులు, సోలార్ ప్లాంట్లు లాంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మక్తల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో శనివారం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి నియోజకవర్గంలోని ప్రతి మండలానికి పది మంది చొప్పున మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గత ప్రభుత్వం తూకం వేసిన నాసిరకం చీరలను పంపిణీ చేస్తే తమ ప్రభుత్వం నాణ్యమైన నేత చీరలను పంపిణీ చేస్తోందన్నారు. ఆడబిడ్డలు చీరలు కడితే చీరకే అందం వచ్చేలా ఉంటుందన్నారు.గతంలో ఇచ్చిన చీరలు పంట పొలాలకు కంచె లు గా మారాయని మంత్రి ఎద్దేవా చేశారు. కానీ తమ ప్రభుత్వం సిరిసిల్లలో నేతన్నలు నేసిన రెండు రకాల డిజైన్ గల చీరలను రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తోందని, మహిళల ఆత్మగౌరవమే తమకు ప్రాధాన్యం అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు చీరను అందిస్తామన్నారు. చీర సారె తో గౌరవం పెరుగుతుందని, అది తమకు కూడా ఎంతో గౌరవం అని మంత్రి తెలిపారు. నియోజక వర్గంలోని ప్రతి అక్కా చెల్లి, తల్లికి చీరలను పంపిణీ చేస్తామని చెప్పారు. అదేవిధంగా నియోజక వర్గంలో కృష్ణా, మాగనూరు మండలాల మినహా మిగతా మండలాల్లో నీటి వనరులు లేవని, నాడు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ప్రాజెక్టులు తప్ప వేరే ఏమీ లేవన్నారు. కానీ జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి నారు మడులు లేని ఊరు ఉండరాదని రూ.4500 కోట్లతో ఒట్టిపోయిన ఈ ప్రాంతంలో మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల శ్రీకారం చుడుతున్నారని, వచ్చే నెల 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ పథకానికి భూమి పూజ చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. 28 రాష్ట్రాల్లో అమలు లేని సన్న బియ్యం మన రాష్ట్రంలో ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అంటే కానీ తమ ప్రభుత్వం వరి అంటే ఉరి కాదు సిరి అని చెప్పి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వరికి గిట్టుబాటు ధర ఇవ్వడంతో పాటు సన్న రకం వరికి క్వింటాకు అదనంగా 500 బోనస్ ఇస్తోందన్నారు. అంతేకాకుండా రైతులు పండించిన వరిని బోనస్ ఇచ్చి మరి కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయకుండా ఇక్కడే బియ్యం చేసి పౌరసరఫరాల శాఖ చౌక ధర దుకాణాల ద్వారా నిరుపేదలకు ఒకరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, ఈ ఘనత ప్రజా ప్రభుత్వాని కే దక్కుతుందన్నారు. అప్పట్లో ఏ దసరా, ఉగాది, దీపావళి, రంజాన్, బక్రీద్, క్రిస్మస్ పండగలకు మాత్రమే పేదల ఇంట్లో సోనా అన్నం తినే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రతి నిరుపేద ఆకలిని సన్న బియ్యంతో వండిన అన్నంతో తీరుస్తున్నామని ఆయన తెలిపారు. గత పదేళ్ల బి ఆర్ ఎస్ ప్రభుత్వం 7.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ఇప్పటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయిన తమ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను నేర వేరుస్తోందని చెప్పారు. ఒక్కో ఇంటికి 5 లక్షల చొప్పున నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లకు 175 కోట్లు ఖర్చు అవుతోందని తెలిపారు. నియోజక వర్గానికి 70 కోట్లతో రోడ్లు వచ్చాయని, కోర్టు, డిగ్రీ కాలేజ్ వచ్చిందని, ఇప్పుడు రూ.200 కోట్లతో మక్తల్ లో పేదింటి పిల్లలు చదువుకునేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి వచ్చే నెల 1న సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేయడానికి వస్తున్నారని మంత్రి తెలిపారు. కాయలు, పండ్లు ఉన్న చెట్లకి రాళ్ళ దెబ్బలు ఉంటాయని, ఇచ్చినవి .. వచ్చినవి. అడగరు కానీ, ఒకరిద్దరి కి రాకపోతే తప్పు పట్టడం సమంజసం కాదని అన్నారు. జిల్లాలో ఇంకా కొన్ని ప్రాంతాల్లో మహిళలు బహిర్భూమికి వెళ్తున్న సందర్భాలు ఉన్నాయని, ఆ పరిస్థితి పోవాలని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలని, లేని వారు దరఖాస్తు చేసుకుంటే వారికి వెంటనే మరుగు దొడ్డి మంజూరు చేసే విధంగా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. అలాగే జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో పదో తరగతి విద్యార్థుల హాజరు, మార్కుల వివరాలను తెలిపేందుకు చదువుల పండగ పేరిట రూపొందించిన క్యూ ఆర్ కోడ్ తో తల్లిదం డ్రులు తమ పిల్లల సామర్థ్యాన్ని తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. అంతకు ముందు ఆ వాల్ పోస్టర్ల ను కలెక్టర్ తో కలిసి మంత్రి ఆవిష్కరించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా ప ట్నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ రోజు నుంచి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం మ ంత్రి చేతుల మీదుగా ప్రారంభం అయిందని, నాలుగైదు రోజులలో జిల్లాలోని అన్ని గ్రామాలలో 18 సంవత్సరాలు నిండిన మహిళలకు చీరలను పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో అన్ని జిల్లాల కలెక్టర్లతో ఇందిరా మహిళా శక్తి చీరల కార్యక్రమం గురించి తెలియ జేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో మన జిల్లా ప్రగతి చాలా బాగుందని కలె క్టర్ పేర్కొన్నారు. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి కి ఫోన్ చేసి జిల్లా కేంద్రంలోని మహిళా పెట్రోల్ బంక్ గురించి అడిగి తెలుసుకు న్నారని, లాభాలతో నడుస్తున్న నారా యణ పేట మహిళా పెట్రోల్ బంక్ ను సందర్శించాలని, నారాయణ పేట మహిళా పెట్రోల్ బంక్ను మోడల్ గా తీసుకుని మీరు మీ మీ జిల్లాల్లో పెట్రోల్ బంక్ లను ఏర్పాటు చేసుకోవాలని ఇతర జిల్లాల మహిళా సమాఖ్య సభ్యులకు తెలపడం మన జిల్లాకు గర్వ కారణం అని కలెక్టర్ అన్నారు. స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, డిఆర్డిఓ మొగులప్ప, తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ అనిల్, డీ పీ ఎం లు, ఏ పీ ఎం లు, మక్తల్ కు చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చేగుంట వడియారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి

● ఏం పి రఘువంధన రావు.

**మెదక్ నవంబర్22( సమయం న్యూస్) :** చేగుంట వడియారం రైల్వే మార్గాన్ని జీరో యాక్సిడెంట్ జోన్ గా తయారు చేయాలి మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కలెక్టరేట్ కార్యాలయంలో రైల్వే, ఫారెస్ట్, ఆర్%బి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసిన ఎంపి రఘునందన్ రావు జిల్లా కేంద్రంలోని చేగుంట వడియారం రైల్వే గేటు వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజల ప్రాణ భద్రతను కాపాడటం, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడం అత్యవసరమని మెదక్ ఎంపీ అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం రైల్వే పెండింగ్ లో ఉండడం వల్ల ప్రతి సారి వందలాది వాహనాలు రెండు వైపులా నిలిచిపోవడంతో అంబులెన్స్లు, అత్యవసర సేవల వాహనాలు తీవ్ర అంతరాయం ఎదుర్కొంటున్నాయన్నారు. రద్దీ సమయంలో పాదచారులు ట్రెక్కులు దాటే పరిస్థితి ఏర్పడి పెద్దా ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. రోడ్డు-రైలు కలిసే స్థాయిలను తగ్గించేందుకు రైల్వే ఓవర్ బ్రిడ్జ్లు, అండర్ బ్రిడ్జ్లు నిర్మించడం ప్రమాదాల నివారణకు ప్రధాన చర్యలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు.

తక్షణం కాంట్రాక్టర్, సంబంధిత శాఖల ఇంజనీర్లు సమన్వయంతో రోబి పనులు పూర్తిచేసి, సర్వీస్ రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్, సిగ్నలింగ్ వంటి అనుబంధ సదు-పాయాలను కూడా సమగ్రంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైల్వే శాఖ, ఆర్ అండ్ బీ శాఖ, ఇతర శాఖల అధికారులందరూ సమన్వయంతో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులను వేగవంతం చేయాలని, రాబోయే రోజుల్లో ఈ మార్గంలో "జీరో యాక్సిడెంట్ జోన్" లక్ష్యంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో రైల్వే ఓవర్ బ్రిడ్జిని పూర్తి చేసి ప్రజల రవాణా సౌకర్యార్థం అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, శాఖల అధికారులందరూ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలి

- వంటేరు ప్రతాప్ రెడ్డి
- గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్
- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను అప్పు పాలు చేయొద్దు
- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం
- అప్పుచేసి వడ్డీ కట్టలేని పరిస్థితిలో ఉన్నారు



**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 22 :**గజ్వేల్ నియోజ కవర్గం లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుందని ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసుకునే పేదవాడికి ఇప్పటివరకు రూపాయి కూడా జమ కాలేదని,అధికారులు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల దగ్గరికి వెళ్లడం లేదని ఫీల్డ్ వర్క్ లేదని కేవలం నామమాత్రంగా ఫోటోలు తీసుకొని అఫీషియల్ సైట్లో అప్లోడ్ చేయడం లేదని తెలిపారుఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వంటేరు ప్రతాపరెడ్డి తెలిపారు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అరచేతిలో వైకుంఠం చూపించి ఆచరణలో అందనంత దూరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఉందని మండిపడ్డారు కాంగ్రెస్ సర్కారు మాటలు కోటలు దాటాయని చేతలు మాత్రము గడప దాటలేనట్టుగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉందని ఎద్దేవా చేశారుఇందిరమ్మ ఇల్లు పేదవాడికి అందుబాటులో లేకుండా పోయిందని తెలిపారు కూలీలు , పేదవాళ్లు ఇల్లు కట్టుకుంటున్నారు కాబట్టి వారికి బిస్మిట్ స్థాయి వరకు 2 లక్షల 50 వేల వరకు వరకు ఖర్చు అవుతుందని అప్పు తీసుకువచ్చి మరి ఇల్లు కట్టుకుంటున్న నిరుపేదలకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు ఇప్పటివవరకు రూపాయి కూడా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు జమ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులను అప్పులపాలు చేయడం చాలా దారుణమని మండిపడ్డారుకాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినట్టు ఇందిరమ్మ ఇల్లు కట్టుకుంటే దాదాపు 15 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారుకాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లా లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక రవాణా చేస్తామని చెప్పి చేతులెత్తేయడం చాలా దారుణమని నేడు ఇసుక మార్కెట్లో 3000 వేలకు టన్ను ఉందని పేద ప్రజలు ఇల్లు ఎలా కట్టుకుంటారో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారుఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను అప్పులపాలు చేస్తుందని వారు వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితిలో ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం నేరుగా టెండర్లు పెట్టి ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పూర్తి స్థాయిలో నిర్మించి లబ్ధిదారు లకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో కూడా ఒక అవకతవకలు జరిగాయని ఇల్లు కట్టుకునే వారికి ఇల్లు మంజూరు కాలేదు ఎవరికైతే ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందో వారు కట్టుకోవడం లేదు ఇది కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎలా ఉందంటే రాత్రి కలలలో ఇంటి నిర్మాణం చేసినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉందని ఎద్దేవా చేశారుఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ఎంపీపీల వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్, మాజీ ఎంపీపీ ర్యాగల సుగుణ దుర్గయ్య, జెడ్పిటిసి అనంతుల ప్రశాంత్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్ , నాయకులు భద్రప్ప, మాజీ ఎంపీటీసీ స్వామి, అహ్మద్, ఐలయ్య, మంచాల పెద్ద శ్రీనివాస్, ఎల్లం, జిర్ర రాజు, రాజిరెడ్డి తదితరులున్నారు

# ప్రధానమంత్రి నుంచి రాష్ట్రపతి వరకు..
# ఆదిలాబాద్ కృషికి అభినందనలు!

**ఫిరోజ్ఖాన్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**

ప్రభుత్వ నివేదికల నుంచి దేశ అత్యున్నత పీఠాల వరకు.. జిల్లా సాధించిన ప్రగతి నేడు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. స్వయంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డును, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా 'ఎక్సలెన్స్' పురస్కారాన్ని అందుకున్న ప్రస్థానం.. నిబద్ధత గల నాయకత్వం, చురుకైన ప్రజా భాగస్వామ్యం కలిస్తే ఏ ప్రాంతం అయినా అగ్రస్థానంలో నిలవగలదని నిరూపించింది. కలెక్టర్ రాజర్షి షా సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ, ప్రతి సంక్షేమ ఫలాన్ని చివరి వ్యక్తికీ చేర్చడంలో ఆయన చూపిన చిత్తశుద్ధి దేశానికే ఆదర్శం. రాజర్షి షా మార్గదర్శకత్వంలో ఆవిష్కృతమైన ఈ "ఆదిలాబాద్ మోడల్".. **భారతదేశం సాధించబోయే సమగ్ర అభివృద్ధికి శక్తివంతమైన స్వర్ణ పూర్తి వివరాలు మంగళవారం చదవండి**



## తెలంగాణ - నార్త్ ఈస్ట్ కనెక్ట్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో "స్పిరిట్ ఆఫ్ ద గేమ్స్
# కనెక్టింగ్ తెలంగాణ అండ్ నార్త్ ఈస్ట్" చర్చాగోష్టి

**హైదరాబాద్, నవంబర్22( సమయం న్యూస్) :** తెలంగాణ–నార్త్ ఈస్ట్ కనెక్ట్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా ఈరోజు "స్పిరిట్ ఆఫ్ ద గేమ్స్ – కనెక్టింగ్ తెలంగాణ అండ్ నార్త్ ఈస్ట్" అనే అంశంపై విశిష్ట చర్చాగోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల నుంచి ప్రముఖ క్రీడాకారులు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.మిజోరం రాష్ట్ర యువజన సేవల % క్రీడల శాఖ మంత్రి లాల్లింగ్ లోవా హ్మార్ "మిజోరం – ఫ్యూచర్ స్పోర్ట్స్ పవర్ హౌస్" అంశంపై మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాలలోని క్రీడా ప్రతిభను జాతీయ వేదికకు తీసుకెళ్లే అవకాశాలను వివరించారు.తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తెలంగాణలో క్రీడల అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సంక్షిప్తంగా వివరించారు.బ్యాడ్మింటన్ స్టార్ పుల్లెల గోపీచంద్ తన అకాడమీ నిర్వహణ, ప్రతిభావికాస విధానాలపై మాట్లాడారు.పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఫుట్‌బాల్ స్టార్ బయ్ చింగ్ భూటియా క్రీడా సంఘాలు, ప్రజల భాగస్వామ్యంపై ప్రాధాన్యతను వివరించారు.మణిపూర్ వెయిట్ లిఫ్టింగ్ స్టార్, పద్మశ్రీ మీరాబాయి చాను క్రీడల్లో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను అంచనా వేసి, వాటి పరిష్కార దిశలో సూచనలు చేశారు.అర్జున అవార్డు గ్రహీత బాక్సర్, ఎల్. సరితాదేవి క్రీడాకారుల తీర్చిదిద్దడంలో కోచ్‌ల కీలక పాత్రను విశదీకరించారు.త్రిపురకు చెందిన అర్జున అవార్డు గ్రహీత మంతు దేవనాద్ జిమ్నాస్టిక్స్ క్రీడాకారుల అభివృద్ధిలో అకాడమీల ప్రాధాన్యాన్ని వివరించారు.క్రీడా జర్నలిస్టు ఇంద్రనీల్ దాస్ ఈశాన్య రాష్ట్రాల్లో క్రీడల వల్ల సంభవించిన సామాజిక మార్పులను వివరించారు.మణిపూర్ వెటరన్




జర్నలిస్టు ప్రదీప్ ఫాంజోభం చర్చాగోష్టి సమన్వయకర్తగా వ్యవహరించారు.వక్తలు తెలంగాణ–ఈశాన్య రాష్ట్రాలకు క్రీడా రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను గుర్తిస్తూ, ప్రభుత్వాలు, క్రీడా సంఘాలు, ప్రజలు కలిసి పనిచేసే అవసరాన్ని హైలైట్ చేశారు.స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ డా. సోనీ బాలాదేవి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మరియు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన పలువురు అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు, క్రీడా సంఘాలు, ఫెడరేషన్ ప్రతినిధులు, స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తో కలిసి ఏర్పాట్ల ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



**కొడంగల్ మున్సిపల్(మం)నవంబర్,22(సమయం న్యూస్) :** శనివారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం ఎన్కే పల్లి గ్రామ శివారు నందు అక్షయ పాత్ర భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్య మంత్రి వస్తున్న సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా, రెండు అంబులెన్సు లు, వైద్య సౌకర్యాలు అన్నింటిని ఏర్పాటు చేయాలనీ సంబంధిత అధికారులకు సూచించారు. శానిటేషన్, బారికేడ్స్,మొబైల్ టై యి లెట్స్, త్రాగునీరు, స్టేజి ఏర్పాట్లు, వి ఐ పి పార్కింగ్ పూర్తి ఏర్పాట్లు చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. తేదీ 24-11-2025(సోమవారం)నాడు రాష్ట్ర ముఖ్య మంత్రి రానున్న నేపథ్యంలో పూర్తి స్థాయి లో ఏర్పాట్లు చేయాలనీ, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ముందు జాగ్రత్త గా ఫైర్ ఇంజన్ ను ఏర్పాటు చేయాలనీ అన్నారు. ఈ సందర్భంగా హెలి ప్యాడ్ ఏర్పాట్ల ను పరిశీలించారు. కలెక్టర్ తో పాటు ట్రైని కలెక్టర్ హార్స్ చౌదరి, గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకా దేవి, ఆర్ అండ్ బి, ఎలక్ట్రిసిటీ రవి కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ ,తహసిల్దార్ రాంబాబు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## రేపు పుట్టపర్తికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ నవంబర్22( సమయం న్యూస్).:** శ్రీ సత్య సాయిబాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొననున్న సీఎంహైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదివారం ఉదయం పుట్టపర్తి చేరుకుంటారు. పుట్టపర్తిలోని సాయి కుల్వంత్ హాల్‌లో నిర్వహించనున్న శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొంటారు...

## సన్న ధాన్యం బోనస్ రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ

**మహబూబ్ నగర్ నవంబర్22( సమయం న్యూస్) :** జిల్లాలో రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలు కోసం వానాకాలం (ఖరీఫ్) 2025-26 సీజన్ సందర్భంగా మొత్తం 190 కొనుగోలు కేంద్రాలు నవంబర్ మొదటి వారం నుండి ప్రారంభించడం జరిగింది

కొనుగోలు కార్యక్రమం క్రమంగా వేగం అందుకుంటూ, నేటి వరకు 13,705 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 2,394 మంది రైతుల నుండి కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 320 మంది రైతులకు రూ. 4.33 కోట్లు %మీగ్రా% చెల్లింపులు జారీ చేయడం జరిగింది. కొనుగోలు వేగవంతం , కేంద్రాల ఇన్‌చార్జీల ద్వారా ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయడానికై ప్రతిరోజూ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తో కలిసి అధ్యక్షతన సమీక్షలు నిర్వహిస్తూ కొనుగోలు కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ సీజన్‌లో పోల్కంపల్లి లో (5) మంది రైతులు 304.800 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని విక్రయించగా, వారికి తో పాటు బోనస్ మొత్తం రూ. 1,52,400/-ను ప్రభుత్వ ఖాతా నుండి జమ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం %మీగ్రా% జమ అయిన తరువాత బోనస్ మొత్తం కూడా ఒక వారంలోపే రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 78 మంది రైతులకు సంబంధించిన బోనస్ మొత్తం రూ. 21.67 లక్షలు ప్రభుత్వ ఖాతా నుండి ప్రాసెస్‌లో ఉండగా, ఇవి తదుపరి 2-4 రోజుల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ కానున్నాయి.

రైతులు దళారులను నమ్మి తమ పంటను తక్కువ ధరకు అమ్మకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు మాత్రమే తీసుకురావాలని జిల్లా అధికారులు విజ్ఞప్తి చేశారు.

బోనస్ అందదనే వదంతులను నమ్మవద్దని, అన్ని చెల్లింపులు విధివిధానాల ప్రకారం జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రాబోయే వారం నుండి ధాన్యం కొనుగోళ్లు ఇంకా వేగం సంతరించుకుంటాయని అధికారులు తెలిపారు. రైతుల వివరాలను సమయానికి లో నమోదు చేయుటకు మరియు ట్యాబ్ ఇన్‌చార్జీలతో రోజువారీ సమీక్షలు జరుపుతూ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## అందరు శిరస్త్రాణం ధరించి ప్రమాదాలనుంచి ప్రాణాలు కాపాడుకోండి




**మహబూబ్ నగర్ నవంబర్22( సమయం న్యూస్).:** అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో అన్ని సెక్షన్ ల సిబ్బంది శిరస్త్రాణం ధరించడం వలన వారికి పెన్నులు బహుకరించడం జరిగింది. కలెక్టరేట్ సిబ్బందిని ఆదర్శం గా తీసుకొని అన్ని శాఖల సిబ్బంది ఎవరైతే కలెక్టర్ కార్యాలయం ప్రతి రోజు ద్విచక్ర వాహనం తో విధులకు హాజరు అవుతున్నారో వారు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించి రావాలని కోరడమైనది. ఈ కార్యక్రమం లో కలెక్టరేట్ ఏ వొ సువర్ణ రాజు పాల్గొన్నారు.

## “గేట్” లో ర్యాంకు సాధించిన శ్రీచందనను అభినందించిన కలెక్టర్



**నిజామాబాద్, నవంబర్ 22( సమయం న్యూస్).** : “గేట్” అర్హత పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జి.శ్రీచందనను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అభినందించారు. భీమ్గల్ మండలం జాగిర్యాల్ గ్రామానికి చెందిన జి. దేవేందర్, స్రవంతి దంపతుల కుమార్తె అయిన శ్రీచందన గేట్ ప్రవేశ పరీక్షలో 81.67శాతం మార్కులతో 302 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శనివారం ఆమెను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అభినందించారు. ఎలాంటి కోచింగ్ లేకుండా సొంతగా ప్రిపేర్ అయి, తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించడం అభినందనీయమని అన్నారు. ఇదే పట్టుదలను కనబరుస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు.

## శ్రీ సత్య సాయి బాబా వారి శత వర్ష 100 జన్మదిన మహోత్సవం




**కొడంగల్ మున్సిపల్(మం)నవంబర్,22(సమయం న్యూస్) :** కొడంగల్ పట్టణ కేంద్రంలోని సన్ సిటీ కాలోని సత్య సాయి నిలయం లో ఓం శ్రీ సాయి రాం భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో భగవాన్ బాబా వారి శత వర్ష 100 జన్మదిన మహోత్సవము (ఆదివారం) నేడు సాయంత్రం ఐదు గంట కు పల్లకి సేవ ఏడు గంటలకు భజన కార్యక్రమం 7:45కు డోలారోహణము 8.05 నిమిషాలకు అతిథులచే ప్రసంగము ఎనిమిది గంటల 30 నిమిషాలకు స్వామివారికి దివ్య మంగళ హారతి ఇట్టి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వికారాబాద్ జిల్లా డిప్యూటీ డి ఎం హెచ్ వో రవీంద్ర యాదవ్, సాయి బంధువులు మరియు కొడంగల్ నివాసులు కాలనీవాసులు అందరికీ కూడా పేరుపేరునా ఆహ్వానము.అందరు కూడా రావలసిందిగా మనవి దశరథ్,శ్రీనివాస్ యాదవ్,శివశంకర్

## ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు

- మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్.
- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ (ఐపీఎస్) ఆదేశాల మేరకు



**మద్దూరు మున్సిపల్(మం)నవ ంబర్,22 (సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా,పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని మద్దూరు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ఈరోజు మద్దూర్ బస్టాండు ప్రధాన చౌరస్తాలలో మద్దూరు పోలీసులు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఏఐసీసీ నాయకుడు విశ్వనాధ్ తో కాంగ్రెస్ నాయకుల భేటీ



**హైదరాబాద్ , నవంబర్ 22 : ( సమయం న్యూస్ ):** ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ సెక్రటరీ విశ్వనాద్ ను శని వారం గాంధీ భవనంలో , సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిసిసి వైస్ ప్రెసిడెంట్ టి. కుమార్ రావు , రాహు ల్ ప్రియాంక గాంధీ సేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఫయాజ్ , కాంగ్రెస్ నాయకులు అమీర్ హుస్సేన్ సయ్యద్ లు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలలో డిసిసి అధ్యక్షుల నియామకం గురించి చర్చించారు.

## ఆదిలాబాద్ కలెక్టర్‌కు సంపాదకుల ఘన సన్మానం



**సమయం నవంబర్22( ఆదిలా బాద్) జిల్లా ప్రతినిధి:** ఒకప్పుడు వెనుకబాటుకు పేరుగాంచిన ఆదిలాబాద్ జిల్లాను, నేడు దేశ పాలనా వ్యవస్థకే దిక్సూచిగా మార్చిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా గారిని పబ్లిషర్స్, ఎడిటర్స్ వెల్ఫేర్ సొసైటీ (పీఈడబ్ల్యూఎస్) హృదయపూర్వకంగా ప్రశంసించింది. స్వయంగా రాష్ట్రపతి, ప్రధానమంత్రి చేతుల మీదుగా జాతీయ పురస్కారాలను అందుకున్న ఈ అద్భుత ప్రగతికి సారథ్యం వహించిన కలెక్టర్‌ను, సొసైటీ జిల్లా అధ్యక్షులు ఫిరోజ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి కదం నరేష్, గౌరవ అధ్యక్షులు ఎలుగు లింగన్నలు కలిసి శనివారం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. పాలనలో ఉన్నత స్థాయి విశ్లేషణను మేళవించి, సాంకేతికతను సమర్థంగా వాడుతూ, ప్రతి సంక్షేమ ఫలాన్ని చివరి వ్యక్తికీ పారదర్శకంగా చేర్చడంలో ఆయన చూపిన చిత్తశుద్ధి దేశానికే ఆదర్శం అని సొసైటీ నాయకులు కొనియాడారు.

# ‘శాంతి భద్రతలే తొలి ప్రాధాన్యం, మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు’

- వికారాబాద్ జిల్లా నూతన ఎస్పీగా స్నేహ మెహ్రా,ఐపిఎస్.











**వికారాబాద్, నవంబర్,22,(సమయం న్యూస్) :** హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా సమర్థవంతంగా విధులు నిర్వహించిన స్నేహ మెహ్రా, ఐపీఎస్ శనివారం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలను స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమెకు సీనియర్ అధికారులు ఘన స్వాగతం పలికారు.అనంతరం చార్జ్ తీసుకున్న సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలోని శాంతి భద్రతల పరిస్థితులను, గత చరిత్రను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, అందుకు అనుగుణంగానే పోలీసు విధానాలలో (పోలిసింగ్ లో) అవసరమైన మార్పులు తీసుకురావడం జరుగుతుందని తెలియజేశారు.నేర నియంత్రణ (క్రైమ్ కంట్రోల్) తన ప్రధాన లక్ష్యమని, జిల్లాలో నేరాల సంఖ్యను గణనీయంగా తగ్గించడానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని, తద్వారా ప్రజలు మరింత ప్రశాంతంగా, భద్రతగా ఉండే వాతావరణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, మరియు ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అంతేకాకుండా, మహిళలు, పిల్లల భద్రతకు, రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, సిబ్బంది సంక్షేమానికి కూడా తగిన చర్యలు తీసుకుంటూ,జిల్లా పోలీసు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తానని శ్రీమతి స్నేహ మెహ్రా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆదనపు ఎస్పీ బి.రాములు నాయక్,డీ సీ ఆర్ బి డిఎస్పీ జానయ్య, డిటిసి డీఎస్పీ ఎన్. యాదయ్య,వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్,ఏఆర్ డీఎస్పీ విరేశ్, జిల్లాలోని ఇన్స్పెక్టర్లు,సర్కిల్ ఇన్స్పెక్టర్ లు,ఆర్ ఐ లు,ఎస్సైలు,ఆర్ ఎస్సై లు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# “షీ” టీమ్ తో మహిళల భద్రత

- మహిళలపైన జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి
- “షీ” టీమ్ పరిగి డివిజన్ ఇంచార్జ్ నర్సింహులు









**దోమ మండలం,నవంబర్ 22(సమయం న్యూస్) :** “షీ” టీమ్ సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై సున్నితంగా స్పందించి, వారు ఎదుర్కొంటున్న భద్రతా సమస్యలను పరిష్కరించేందుకు సమర్ధవంతంగా పనిచేస్తుందని “షీ” టీమ్ పరిగి డివిజన్ ఇంచార్జ్ నర్సింహులు అన్నారు. పరిగి నియోజకవర్గం దోమ పోలిస్ స్టేషన్ పరిధిని దాదాపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో శనివారం జిల్లా నూతన ఎస్పీ స్నేహ మెహ్రా, పరిగి డిఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలతో “షీ” టీమ్ పనితీరు పై ఈ కళాభృందం ఇంచార్జ్ అశోక్, దోమ హెడ్ కానిస్టేబుల్ నర్సింహులు సమక్షంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యంఇఒ వెంకట్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో భాగంగా “షీ” టీమ్ పరిగి డివిజన్ ఇంచార్జ్ నర్సింహులు మాట్లాడుతూ “షీ” టీమ్ మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద “షీ” టీమ్ నిరంతరంగా పని చేస్తుందని అన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 181,100 నంబర్లకు ఫోన్ చేసి సమస్య తెలుపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని అన్నారు.మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. మహిళలు బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లు 100, 181 ను సంప్రదించాలని అన్నారు. మొబైల్ వాడకం దారులు అనుకొని పరిస్థితులలో సైబర్ క్రైమ్ లో మోసపోయినట్లు గుర్తించిన వెంబడి టోల్ ఫ్రీ నెంబర్ 1930కు తగిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. అదేవిదంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం గురించి, సీసీ కెమెరాలు, బాల్య వివాహాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్ మానవ అక్రమ రవాణా తోపాటు మద్యపాన నిషేధం గురించి వివరించారు. అంతే కాకుండా మహిళలు బాలికలు టి-సేఫ్ యాప్ ను ప్లే స్టోర్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలని తెలిపారు. ఎవరైనా భద్రతపరంగా ఇబ్బందులకు గురైన “షీ” టీమ్ కు ఫిర్యాదు చేసినట్లు ప్రకటించకుండానే మీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ముఖ్యంగా యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ యాక్ట్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సేఫ్టీ, తదితర అంశాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్ నాథ్,విద్యార్థులు, విద్యార్థినీలు, ఉపాధ్యాయులతో పాటు “షీ” టీమ్ సభ్యులు సావిత్రి, శోభ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన చట్టం అవగాహన కార్యక్రమం-2025

- నూతన విత్తన చట్టం ముసాయిదాపై లబ్ధిదారుల అభిప్రాయ సేకరణ...
- జిల్లా వ్యవసాయ అధికారి కే. శివప్రసాద్



**సంగారెడ్డి నవంబర్22( సమయం న్యూస్).:** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జాయింట్ డైరెక్టర్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో నూతన విత్తన చట్టం-2025 ముసాయిదా పై అవగాహన, అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి కే. శివప్రసాద్ మాట్లాడుతూ... భారత ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నూతన విత్తన చట్టం-2025 ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు, నర్సరీ మొక్కలు అందుబాటులోకి తేవడం, నకిలీ విత్తనాల నియంత్రణ, విత్తనాల దిగుమతుల సరళీకరణ, అలాగే రైతుల హక్కుల పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత నిచ్చినట్లు తెలిపారు.విత్తన నాణ్యతపైన నియంత్రణ, వాణిజ్య సరళీకరణ, అలాగే ఉల్లంఘనలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ చట్టంలో పలు నిబంధనలు చేర్చినట్లు పేర్కొన్నారు.ఈ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించేముందు రైతులు, లబ్ధిదారులు, పరిశ్రమల ప్రతినిధులు వంటి ప్రయోజనకారుల అభిప్రా యాలు సేకరించి, వాటి ఆధారంగా ముసాయిదాలో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత చట్టంలో పది అధ్యాయాలు, 48 విభాగాలు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం నోటిఫై చేసిన విత్తన రకాలపైనే నియంత్రణ అధికారాలు ఉంటాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం బసంతపూర్ (చెరుకు) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ కె. రాహుల్ విశ్వకర్మ, తెలంగాణ మంజీర రైతు సమైక్య టి. పృథ్వీరాజ్, తెలంగాణ రైతు రక్షణ సమితి కే. రాఘవేందర్ రెడ్డి, సీడ్ సర్టిఫికేషన్ విభాగం ఫస్ట్ అండ్ డైరెక్టర్ ఎం. శివప్రసాద్, హార్టికల్చర్ అధికారి టీస్ స్పందన, వ్యవసాయ అధికారులు తదితరులుపాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళల ఆత్మగౌరవం ఇనుమడింపు

- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి
- అట్టహాసంగా ఇందిరమ్మ చీరల పంపిణీకి శ్రీకారం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు



**నిజామాబాద్, నవంబర్ 22( సమయం న్యూస్):** మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల ప ంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిజామాబాద్ కలెక్టరేట్ లో అట్టహాసంగా ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తదితరులు ఈ వేడుకలో భాగస్వాములు కాగా, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా మహిళలకు లాంచనంగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఎంతో ఆకర్షణీ యంగా, నాణ్యతతో కూడిన చీరలను పంపిణీ చేయడం పట్ల మహిళలు, మహిళా సమాఖ్య ప్రతినిధులు హర్షం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక, సామాజిక ప్రగతిని చాటాలని పిలుపునిచ్చారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈసారి నాణ్యమైన చీరలను తయారు చేయించిందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం చీరలను అందించారని ఆక్షేపించారు. ఎలాంటి విమర్శలకు ఆస్కారం లేకుండా, తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం అన్ని జిల్లాలకు సరిపడా చీరలను పంపించిందని, అవసరమైన పక్షంలో జిల్లాకు మరిన్ని చీరలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, అర్హులైన ఏ ఒక్కరు మినహాయిం చబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని, భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితవు పలికారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వైపు పిల్లలు పెడదారి పట్టకుండా కాపాడుకోవాలని, నిపుణులైన ఉపాధ్యాయులు, మెరుగుపడిన సదుపాయాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించాలని హితవు పలికారు. మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాలను పరిరక్షిం చుకోవాలని, రసాయనిక మందులు వినియోగించకుండా సేంద్రీయ పద్ధతిలో పందిరి కూరగాయల సాగు వంటివి చేపట్టేందుకు ముందుకు వచ్చే మహిళా సఘాలు, సమాఖ్యలకు ప్రభుత్వపరంగా మరింత ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి పేరిట 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చీరల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత మహిళలకు తొలి విడతలో చీరలను పంపిణీ చేస్తున్నారని, పట్టణ ప్రాంతాలలో మార్చి 1వ తేదీ నుండి వారం రోజుల పాటు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు. వడ్డీ లేని రుణాలను అందించడమే కాకుండా, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాయితీపై రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తోందన్నారు. మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసం ఇతోధికంగా తోడ్పాటును అందిస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వ తోడ్పాటుతో మహిళలు సమిష్టిగా ఉంటూ తమ వ్యాపార కార్యకలాపాలను మరింతగా విస్తరించాలని, తద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఆచరణలో నిరూపితం చేయాలని పిలుపునిచారు. ఇదిలాఉండగా, ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఇందిరమ్మ చీరలు ఎంతో నాణ్యతతో కూడుకుని ఉన్నాయని అన్నారు. అర్హులైన వారందరికీ చీరలు పంపిణీ జరిగేలా పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డిలు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉ ర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, మహిళా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

# మహిళలు ఆర్థిక అభివృద్ధిని సాధించాలి

- మహిళలు ఆర్థికంగా, ఆరోగ్యంగా బాగుండాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ధర్మసాగర్ లో ధర్మసాగర్ వేలేరు మండలాలకు చెందిన మహిళలకు
- ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన
- ఎంపీ కడియం కావ్య, స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ నవంబర్22( సమయం న్యూస్).:** మహిళలు విభిన్న రంగాల్లో రాణిస్తూ ఆర్థిక అభివృద్ధిని సాధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్ లో ధర్మసాగర్, వేలేరు మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, ఆరోగ్యంగా బాగుండాలని పేర్కొన్నారు. మహిళా సాధికారత లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు పెట్రోల్ బంకులు, దాదాపు 150 బస్సులను మహిళలకు కేటాయించిందని తెలిపారు. అదేవిధంగా సోలార్ పవర్ ప్లాంట్ లు కూడా మహిళలకు ప్రభుత్వం ఇస్తుందన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, కుట్టు కేంద్రాల మహిళలకు ఉపాధి అవకాశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను భాగస్వామ్యం చేస్తున్నారని పేర్కొన్నారు . మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే రాష్ట్రం ప్రగతి సాధిస్తుందన్నారు. మహిళలు విభిన్న రంగాల్లో ప్రథమంగా నిలవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరలు చాలా బాగున్నాయని, తనకు ఒక చీరను అందిస్తే మరొక ప్రోగ్రాం కు ధరించి వస్తానని అన్నారు. ఆకాశం రంగును ప్రతిబింబించే విధంగా చీరలను నీలం రంగుతో ఎంతో ప్రణాళికతో తయారు చేయించారని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం సంతోషకరంగా ఉ ందన్నారు. ఈ సమావేశంలో స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించి చేయూతనంది స్తోం దన్నారు. ఇందిరమ్మ చీరలు మహిళలు మెచ్చే విధంగా ఉన్నాయన్నారు. పట్టు చీరల మాదిరిగా ఇందిరమ్మ చీరలు ఉన్నాయని అన్నారు. గతంలో పంపిణీ చేసిన చీరలు ఇలా ఉండేవి కావని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు, సన్న బియ్యం పంపిణీ, తదితర సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఒక్కో మండలంలోని మహిళా సమాఖ్య ఆర్థిక అభివృద్ధి సాధించే విధంగా బస్సును కొనుగోలు చేసి ఇచ్చామని, వాటి ద్వారా మహిళా సమాఖ్యలు ఆర్థికాభి వృద్ధిలో నిలుస్తున్నాయన్నారు. వేలేరు మండల సమాఖ్యకు బస్సును కేటాయించాలని కలెక్టర్ ను కోరారు. మహిళా శక్తి కార్యక్రమాల కింద వేలేరు, ధర్మసాగర్ మండలాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అభివృద్ధిలో మండలాలను ముందువ రుసలో నిలపాలన్నారు. మండలాల్లోని అన్ని గ్రామాలలో ఇంటింటికి చీర చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిం చారుఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అన్ని రంగాలలో ముందుండాలనే ఉద్దేశంతో సోలార్ పవర్ ప్లాంట్ లు, ఆర్టీసీ బస్సుల కేటాయింపు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ లో భాగస్వామ్యం చేస్తుం దన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించి రాష్ట్ర ప్రగతికి తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా సమైక్య ఆధ్వర్యంలో జిల్లాలోనే ధర్మసాగర్ లో సెరికల్చర్ యూనిట్ ను త్వరలోనే ప్రారంభించుకోబోతున్నామని తెలిపారు. మహిళలే వాటి నిర్వహణ చేస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని మరిన్ని మండలాల్లోనూ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మహిళలు రాణించాలని సూచించారు. ధర్మసాగర్, వేలేరు మండ లాలకు సంబంధించిన మహిళా సంఘాల ప్రతినిధులకు ఇందిరమ్మ చీరలను ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, తహసిల్దార్లు సదానందం, కోమి, ఎంపీడీవోలు అనిల్ కుమార్, లక్ష్మీ ప్రసన్న, ఇతర అధికారులతో పాటు ధర్మసాగర్ వేలేరు మం డలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ సరఫరా వేగవంతం చేయండి.

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా.



**ఆదిలాబాద్ నవంబర్22( సమయం న్యూస్)** : జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరాను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజార్షి షా మిల్లర్లను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్లో నిర్వహించిన సమీక్షా సమా వేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే ప్రభుత్వం విధించిన గడువులు ముగుస్తున్న నేపథ్యంలో మిల్లర్లు సన్నబియ్యం మిల్లింగ్, సి.ఎం.ఆర్ సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమయానికి సి.ఎం.ఆర్ సరఫరా చేయని మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించిన కలెక్టర్, డిసెంబర్ నెలాఖరు లోపు వందశాతం సి.ఎం.ఆర్ సరఫరా పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతి వారం సరఫరా పురోగతిపై యాక్షన్ ప్లాన్ రూపొందించి నివేదికలు సమర్పించాలని మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, సన్నబియ్యం పూర్తిగా మిల్లింగ్ చేసి సమయానికి సివిల్ సప్లై గోదాములకు అందజేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా పౌర సరఫరాల అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ శ్యామల దేవి, జిల్లా పౌర సరఫరాల అధికారి నందిని, సంస్థ జిల్లా మేనేజర్ సుధారాణి, అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# బుట్టి రాజారామ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ గారు
- పిఒ ఎమ్హెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా గారితో కలిసి



**కరీంనగర్ నవంబర్22( సమయం న్యూస్)):** హాజరు రిజిస్టర్,అవుట్ పేషెంట్ రిజిస్టరు లను ఇతర రికార్డులను వెరిఫై చేశారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది పర్ఫామెన్స్ ని ఏఎన్ఎం వారీగా అన్ని ఆరోగ్య కార్యక్రమాల అమలు పనితీరును సమీక్షించారు. ఎన్ సి డి క్లినిక్ లో అసంక్రామిత వ్యాధుల బ్లూ మరియు రెడ్ రిజిస్టర్ లను అందులో నమోదైన అధిక రక్తపోటు మరియు షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాల నమోదును పరిశీలించి వారికి మందులు ఇస్తున్న తీరును పరిశీలించారు. ఫార్మసీ స్టోర్స్ లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. పిల్లల వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్ ను దాని రోజువారి టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. ఐఇసి బోర్డును పరిశీలిస్తూ దానిపై ప్రదర్శించిన అధిక రక్తపోటు షుగర్ వ్యాధి మందులకు సంబంధించిన వివరాల స్పెసిమెన్ లను పరిశీలించారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో మహిళల రీస్క్రీనింగ్ 100% పూర్తి చేయాలన్నారు. రిఫరల్ కేసులను ఫాలో అప్ చేస్తూ వారికి అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఓ ఎమ్ హెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పద్మజ, సూపర్వైజర్ విజయలక్ష్మి మరియు సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ముద్ర యోజన పథకం పై అవగాహన



**జనగాం నవంబర్22( సమయం న్యూస్).:** జిల్లా పరిశ్రమల కేంద్రం జనగామ మరియు ఇంట్రెప్రెనెర్షిప్ డెవలప్మెంట్ సెంటర్ ల ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం మీద ఒక రోజు అవగాహన సదస్సు జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరిగింది.

జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ శ్రీ శివ కృష్ణ పాల్గొని ముఖ్యాంశాలు వివరించారుముద్ర యోజన ప్రాధాన్యత, లక్ష్యాలు మరియు లబ్ధిదారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ట్రైనర్ మనోజ్ కుమార్ ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి ముద్ర యోజన చిన్న, సూక్ష్మ వ్యాపారుల కోసం రూపొందించిన అత్యంత ప్రయోజనకరమైన పథకం అని చెప్పడం జరిగింది. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మూర్తి ముద్ర యోజన పథకం శిశు, కిశోర్, తరుణ్ విభాగాల్లో రుణాలు పొందేందుకు అవసరమైన అర్హతలు, ప్రాసెస్ మరియు బ్యాంకుల పాత్రను పేర్కొంటూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో యువత, మహిళలు, చిన్న వ్యాపారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని, స్వయం ఉపాధిని ప్రోత్సహించడంలో ఈ యోజన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో ఇంట్రెప్రెనెర్షిప్ డెవలప్మెంట్ సెంటర్ మేనేజర్ చీటూరి సతీష్, అసిస్టెంట్ మేనేజర్ ఫిలిఫ్ ఔత్సాహిక యువత, చిన్న వ్యాపారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సానిటరీ ఇన్స్పెక్టర్ లు ట్రేడ్ వసూళ్ల పై దృష్టి సారించండి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- సానిటరీ ఇన్స్పెక్టర్ లతో ట్రేడ్ వసూళ్ల పై సమీక్ష.



**వరంగల్ నవంబర్22( సమయం న్యూస్):** సానిటరీ ఇన్స్పెక్టర్ లు ట్రేడ్ వసూళ్ల పై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కమిషనర్ ఛాంబర్ లో ట్రేడ్ వసూళ్ల పురోగతిపై సానిటరీ ఇన్స్పెక్టర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్ధవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత నెల రోజుల నుండి ట్రేడ్ వసూళ్ల లో పురోగతి కనిపించడం లేదని సానిటరీ ఇన్స్పెక్టర్లు వారికి కేటాయించిన డివిజన్ల వారిగా శానిటేషన్ కార్యకలాపాలతో పాటు సమంతరం గా ట్రేడ్ వసూళ్ల జరిపే బాధ్యత ఎస్ ఐ ల పై ఉందని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఎం హెచ్ ఓ డా.రాజేష్ సానిటరీ సూపర్ వైజర్ లు భాస్కర్ గోల్కొండ శ్రీను నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) నిధులు రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో యూని సిటీ మాస్టర్ ప్లాన్ రోడ్ 4 లెన్స్ బి టి రోడ్డుగా ఉనికి చెర్ల వరకు వెడల్పు చేయడం తో పాటు, కుడా నిధులు రూ.8 కోట్ల వ్యయం తో యూని సిటీ లే ఔట్ లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వరంగల్ లోక్ సభ సభ్యురాలు శ్రీమతి కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కుడా వైస్ ఛైర్మన్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లు సంయుక్తం గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ రాధిక రెడ్డి కుడా సి పి ఓ అజిత్ రెడ్డి ఈఈ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ సర్వే పూర్తి చెయ్యండి.

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి నవంబర్22( సమయం న్యూస్).:** చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పంట కాలు వలకు భూసేకరణ, ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రగతిపై శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, మెగా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట కాలువలు నిర్మాణానికి ఎంత భూమి అవసరం ఉంది, ఎంత మంది రైతుల భూములు కోల్పోతున్నారు, ఎన్ని ఎకరాలు అవసరం అవుతుందనే అంశాలపై సమగ్రంగా వివరించారు. ప్రాజెక్టు ప్రగతిపై ప్రతి వారం సమీక్ష ఉంటుందని గత వారం సమీక్షలో చేసిన సూచనల మేరకు, ఈ వారం వరకు సాధించిన పురోగతిని సమీక్షించారు. సర్వేలో ప్రభావిత గ్రామాలు, సర్వే నంబర్లు, రైతుల వారీగా భూ వివరాలు, పంటల సాగుపై స్పష్టమైన అవగహన కలిగి ఉండాలని సూచించారు. పంట కాలువల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా సాగేందుకు, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎస్డీసి రమేష్, ఇరిగేషన్, మహదేవపూర్, కాటారం, మల్హార్, మహా ముత్తారం మండలాల తహసీల్దార్లు, మెగా కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల ప్రక్రియకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు





**వికారాబాద్, నవంబర్,22(సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లాలోని 594 గ్రామపంచాయతీలకు గాను రిజర్వేషన్ల ప్రక్రియకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా సీట్లను కేటాయించడం జరిగింది. తాండూర్ డివిజన్ లో 8 మండలాలల్లో 262 గ్రామ పంచాయతీలకు కేటాయింపులు చేయగా, వికారాబాద్ డివిజన్ కు సంబంధించి 12 మండలాల్లో 332 గ్రామపంచాయతీలకు లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు చేయడం జరిగింది. రిజర్వేషన్ల ప్రక్రియకు అనుగుణంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డిఓ వాసు చంద్ర,డిపిఓ జయసుధ లు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ విధానం ద్వారా సీట్ల కేటాయింపులు చేయడం జరిగింది.

# అండర్ గ్రౌండ్ లోని పైపులలో పేరుకు పోయిన చెత్తను తొలగించాలి

- నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి
- వరంగల్ డి మార్ట్ వద్ద చెత్త తొలగింపు పరిశీలన...
- పోచమ్మ మైదాన్ వద్ద కొనసాగుతున్న పైప్ లైన్ పనులను పరిశీలించిన మేయర్...



**వరంగల్ నవంబర్22( సమయం న్యూస్).:** అండర్ గ్రౌండ్ లోని పైపు లలో పేరుకు పోయిన చెత్త ను తొలగించాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అన్నారు. శనివారం వరంగల్ పరిధి డి మార్ట్ ప్రాంతం వద్ద, పోచమ్మ మైదాన్ వద్ద పైప్ లైన్ ఏర్పాటు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్ధవంతం గా పూర్తి చేయుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ వరంగల్ డీ మార్ట్ ప్రాంతం లో అండర్ గ్రౌండ్ లో ఉన్న పైప్ లలో చెత్త చెదారం పేరుకుపోయి మురికి నీరు బయటకు వెళ్లలేక రోడ్డు మీద డ్రైనేజీ నీరు ప్రవహించడం తన దృష్టికి రావడం జరిగిందని ఇట్టి సమస్యకు పరిష్కారం చూపడానికి వీలుగా ఆ ప్రాంతం లో భూమి లోపల ఉన్న పైప్ లలో పేరుకు పోయిన చెత్త చెదారాన్ని తొలగించి పరిష్కారం చూపడానికి హైదరాబాద్ నుండి బృందాన్ని పిలిపించి యంత్రాల ద్వారా తొలగింపు చేపడతారని పైపుల్లో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగిస్తారని దీని వల్ల భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తవని అండర్ గ్రౌండ్ లో గల పైపుల లో ఉన్న చెత్త ను తొలగించడానికి వరంగల్ ప్రాంతం లో దశల వారీగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మేయర్ అన్నారు. దేశాయి పేట ఫిల్టర్ బెడ్ నుండి పోచమ్మ మైదాన్ ప్రాంతం లో తరచుగా లీకేజీ లు ఏర్పడడానికి 1950 సంవత్సరం లో వేసిన పైప్ లైన్ కారణం అని, ఒకచోట లీకేజీ అరికట్టగానే ఇదే ప్రాంతం లో మరో లీకేజీ లు ఏర్పడుతున్నాయని ఇట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి కొత్త పైప్ లైన్ వేయడం జరుగుతుందని అన్నార్లు, ఈ ప్రాంతం లో లీకేజీ ల సమస్య శాశ్వతంగా ప్రిష్కారం అవుతుందన్నారు.ఎస్ ఈ సత్యనారాయణ డిఈ సతీష్ ఏఈ లు హబీబ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ప్రారంభించిన వరంగల్ పోలీస్ కమిషనర్



**హన్మకొండ నవంబర్22( సమయం న్యూస్).:** నేరానికి సంబంధించి సంఘటన స్థలంలో నిందితులను గుర్తించడంతో పాటు సాక్ష్యాధారాలను సేకరించే ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతనంగా మొబైల్ ఫోరెన్సిక్ రెండవ వాహనాన్ని అందజేసారు. ఈ వాహనాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో వున్న పరిజ్ఞానాన్ని వినియోగించుకొని. అత్యాధునిక పరికరాల తో రూపొందించబడిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనాని వరంగల్ కమిషనరేట్ పోలీసులకు మరింత మెరుగైన సేవలందించనున్నది. ఇకపై ఎదైనా నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బంది ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో చేరుకోని సంఘటన జరిగిన స్థలం నుండి రక్తమరకలు, వేలిముద్రలతో ఇతర సాక్ష్యాధారాలను సేకరించి ఈ మెబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన అధునిక పరికరాలతో పరీక్షలను నిర్వహించి సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేయడం జరుగుతుందని. ఈ మొబైల్ వాహనం లో విధులు నిర్వహించేందుకు ఆరుగురు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందజేయడం జరిగిందని సీపీ తెలియజేసారు. డిసిపి అంకిత్ కుమార్,గుణ శేఖర్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్, శ్రీనివాస్ తో పాటు ఏసీపీ లు, ఆర్. ఐ లు, ఫింగర్ ప్రింట్ ఇన్స్ స్పెక్టర్లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కౌలు రైతులకు సోయా మొక్కజొన్న కొనుగోలులో సడలింపు

- ఆన్లైన్ OTP విధానంతో విక్రయం
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ నవంబర్22( సమయం న్యూస్).:** కౌలు రైతుల కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున సదుపాయాలు కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలతో సమీక్ష నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కౌలు రైతులు పత్తితోపాటు సోయాబీన్, మొక్కజొన్న పంటలను కూడా విధానంతో విక్రయించుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి మండలంలో రైతులకు చేరేలా విస్తృత ప్రచారం చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎకరాకు 7 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చిన రైతులకు 12 క్వింటాళ్ల వరకు అమ్మేలా లు నిర్ధారించాలి అని అన్నారు. డిజిటల్‌గా నమోదు కాని కౌలు రైతులకు మద్దతు ధరతో పంటల విక్రయం చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. పోర్టల్‌లో నమోదైన రైతుల వివరాలు నేరుగా అగ్రి పోర్టల్‌కు లింక్ చేశామని వెల్లడించారు. మార్కెట్‌కు వచ్చినపుడు రైతులు ఆధార్, బ్యాంక్ పాస్‌పుస్తకం వివరాలను పోర్టల్‌లో పొందుపరిచి నమోదు చేయాలని, తర్వాత బయోమెట్రిక్ ధృవీకరణ ఆధారంగా పంట కొనుగోలు చేసి తక్కట్టు పత్రం జారీ అవుతుందని చెప్పారు. కౌలు రైతులు రైతు భరోసా ఆన్లైన్ వ్యవస్థ ద్వారా మార్క్‌ఫెడ్ కొనుగోళ్లకు అనుసంధానమైందని తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి తమ వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. సందేహాల నివృత్తికి 6300001597 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. జిల్లాలో వ్యవసాయ యంత్రాంగం కోసం 5,193 వ్యవసాయ పనిముట్లకు రూ. 380 లక్షలు మంజూరు చేశామని కలెక్టర్ తెలిపారు. సన్న, చిన్నకారు, ఎస్సీ%-ఎస్టీ మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతరులకు 40 శాతం సబ్సిడీపై రోటావేటర్లు, కల్టివేటర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు తక్కువగా ఉన్న మండలాల్లో ప్రచారం పెంచాలని ఆదేశించారు. రైతుల ఆదాయం పెంచడం, ఆధునిక వ్యవసాయం ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ లక్ష్యం సమిష్టిగా పూర్తి చేయాలని, సమగ్ర ఉద్యాన మిషన్ లక్ష్యం లోగా జనవరిలోగా పూర్తి చేయాలని అన్నారు. కూరగాయల నారు లక్ష్యం డిసెంబరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదనంగా 2,000 స్ప్రింక్లర్ సెట్లు పొందేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, ఉద్యాన అధికారి నర్సయ్యతో పాటు విభాగాధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## రోహిత్ శర్మకే మళ్లీ వన్డే కెప్టెన్సీ!

సౌతాఫ్రికాతో తొలి టెస్టులో గాయపడ్డ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. గువాహటి వేదికగా సౌతాఫ్రికాతో శనివారం ప్రారంభమైన రెండో టెస్టుకు దూరమయ్యాడు. దీంతో వైస్‌కెప్టెన్ రిషభ్ పంత్ ఈ మ్యాచ్‌కు కెప్టెన్ బాధ్యతలు స్వీకరించాడు. అయితే సౌతాఫ్రికా ఈ పర్యటనలోనే టెస్టు సిరీస్ ముగిశాక, వన్డే, టీ20 సిరీస్‌లు ఆడాల్సి ఉంది. వన్డే సిరీస్ ఈనెల 30న ప్రారంభం కానుంది. ఈ క్రమంలో అభిమానుల్లో ఓ సందేహం నెలకొంది.ప్రస్తుతం సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ ఆడుతున్న భారత్ మరో 8 రోజుల్లోనే వైట్ బాల్ సిరీస్‌లో బరిలో దిగాల్సి ఉంది. అయితే భారత వన్డే జట్టుకు కూడా శుభ్‌మన్ గిల్‌నే కెప్టెన్. దీంతో ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షనలో ఉన్న గిల్ మరో 8 రోజుల్లో కోలుకుంటాడా అనే సందేహాలు మొదలయ్యాయి. గతకొంత కాలంగా గిల్ విశ్రాంతి లేకుండా క్రికెట్ ఆడడం, ఇకపై టీమ్‌ఇండియాకు కీలక సిరీస్‌లు ఉన్న నేపథ్యంలో అతడి విషయంలో బీసీసీఐ జాగ్రత్తగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.ఈ పరిస్థితుల్లో గిల్ పూర్తిగా కోలుకోకముందే జట్టులోకి తీసుకురావడం అసాధ్యం. అలాగే వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా ప్రస్తుతం గాయం నుంచి రికవరీ అవుతున్నాడు. గత నెలలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా అయ్యర్ గాయపడ్డాడు. అప్పట్నుంచి అయ్యర్ జట్టుకు దూరమయ్యాడు. ఇప్పటికీ అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదని తెలుస్తోంది. దీంతో అయ్యర్ కూడా సౌతాఫ్రికా వన్డే సిరీస్‌లో బరిలోకి దిగడం దాదాపుగా అసాధ్యమే! అలా కెప్టెన్, వైస్ కెప్టెన్ ఇద్దరూ గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో రానున్న వన్డే సిరీస్‌లో జట్టుకు ఎవరు సారథ్యం వహిస్తారు అనేది ఆసక్తిగా మారింది. ఒకవేళ గిల్, అయ్యర్ దూరమైతే టీమ్‌ఇండియాను ఎవరు నడిపిస్తారనేది అభిమానుల మదిలో ఉన్న ప్రశ్న. దీంతో సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మకు మళ్లీ కెప్టెన్ బాధ్యతలు అప్పగిస్తారా? అని అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేస్తున్నారు. అలా రోహిత్‌కు కెప్టెన్సీ ఇస్తే బాగుంటుందని కామెంట్లు చేస్తున్నారు. అంతేకాకుండా జట్టు పరంగా చూసుకుంటే అది ఉత్తమమైన ఛాయిసే. కానీ, బీసీసీఐ ఆ నిర్ణయం తీసుకోవడం దాదాపు అసాధ్యం! ఎందుకంటే ఒకసారి కెప్టెన్సీ నుంచి తప్పించిన తర్వాత మళ్లీ బాధ్యతలు ఇచ్చే ఛాన్స్ లేదు.అయితే గిల్?కు ఇప్పుడున్న గాయం పెద్దదేమీ కాదు. ఇప్పటికే గిల్ కోలుకుంటున్నాడు. వన్డే సిరీస్?కు ఇంకా వారం సమయం ఉంది. మెడనొప్పి నుంచి కోలుకోవడానికి ఈ గ్యాప్ సరిపోతుంది. ఈ క్రమంలో గిల్ త్వరితగతిన కోలుకొని జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అలా వస్తే, వన్డే సిరీస్‌లో కూడా గిల్ నడిపిస్తాడు. ఒకవేళ రాకపోతే ఇంకో యువ ఆటగాడికి సారథిగా ఎంపిక చేసే అవకాశాలను బీసీసీఐ కనుగొనవచ్చు!

## ఎలైట్ లిస్ట్‌లో రిషభ్ పంత్

గువాహటి వేదికగా భారత్– సౌతాఫ్రికా మధ్య రెండో టెస్టు ప్రారంభమైంది. ఈ మ్యాచ్?లో టాస్ నెగ్గిన సౌతాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే రెగ్యులర్ కెప్టెన్ శుభ్?మన్ గిల్ గాయం కారణంగా ఈ టెస్టుకు దూరం కావడం వల్ల, రిషభ్ పంత్ పగ్గాలు అందుకున్నాడు. ఈ క్రమంలో పంత్ అరుదైన ఘనత సాధించాడు. భారత్?కు టెస్టుల్లో సారథ్యం వహించిన 38వ కెప్టెన్?గా నిలిచాడు.ఈ టెస్టుకు కెప్టెన్?గా ఎంపిక అవ్వడంపై పంత్ మాట్లాడాడు. ఇది తనకు ఓ గౌరవం అని చెప్పాడు. 'కెప్టెన్‌గా ఒకే టెస్టుకు సారథ్యం వహించడం బాగా అనిపించదు. కానీ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు బీసీసీఐకి కృతజ్ఞతలు. ఏ పరిస్థితుల్లో అయినా సరే జట్టును నడిపించడం గర్వకారణమే. కొన్నిసార్లు సంప్రదాయబద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం బాగుంటుంది. మరికొన్నిసార్లు కొత్తగా ట్రై చేస్తే మంచి ఫలితాలు అందుకోవచ్చు. కానీ ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేయడం తెలిసి ఉండాలి. ఆటను ఆస్వాదిస్తూ జట్టు కోసం నేను చేయాల్సింది వంద శాతం చేస్తా' అని పంత్ మ్యాచ్?కు ముందు ప్రెస్ కాన్ఫిరెన్స్?లో పేర్కొన్నాడు.ఈ టెస్టుకు కెప్టెన్?గా వ్యవహరించడంతో పంత్ అరుదైన రికార్డు సాధించాడు. టెస్టుల్లో భారత్ జట్టుకు సారథ్యం వహించిన రెండో వికెట్ కీపర్, బ్యాటర్?గా నిలిచాడు. పంత్ కంటే ముందు మహేంద్రసింగ్ ధోనీ మాత్రమే (వికెట్ కీపర్, బ్యాటర్) టీమ్‌ఇండియాను టెస్టుల్లో నడిపించాడు. 100ఏళ్ల చరిత్ర ఉన్న భారత టెస్టు జట్టుకు ఈ ఇద్దరు వికెట్ కీపర్లే కెప్టెన్సీ వహించిన ఘనత అందుకున్నారు.టెస్టుల్లో అత్యధిక ప్లేయర్లు కెప్టెన్?గా ఉన్న నాలుగో జట్టుగా భారత్ కొనసాగుతోంది. 1928లో భారత్ ఆడిన తొలి టెస్టు నుంచి ఇప్పటిదాకా జట్టుకు 38 మంది ఆటగాళ్లు కెప్టెన్లుగా వ్యవహరించారు. ఈ లిస్ట్?లో ఇంగ్లాండ్? 82 మంది కెప్టెన్లతో టాప్?లో ఉంది.

# ముగిసిన తొలి రోజు ఆట

**మలుపు తిప్పిన కుల్దీప్ యాదవ్!**

**6 వికెట్లకు సౌతాఫ్రికా 247 పరుగులు**

**సునాయస క్యాచ్ లు నేలపాలు**




గౌహతి టెస్ట్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 6 వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసింది. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. మూడో సెషన్‌లో భారత జట్టు 81వ ఓవర్లో కొత్త బంతిని తీసుకోవడంతో భారత్ కం బ్యాక్ చేయగలిగింది. కొత్త వ్యూహం పనిచేసింది. ఎందుకంటే ఆ తరువాతి ఓవర్లో మహ్మద్ సిరాజ్ ఓ వికెట్ తీశాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా సెనురన్ ముత్తుసామి, కైల్ వెరెయిన్ నాటౌట్‌గా నిలిచారు. దక్షిణాఫ్రికాకు చెందిన బ్యాట్స్‌మెన్‌లు బ్యాటింగ్‌లో మంచి ప్రారంభం ఇచ్చారు. కానీ ఎవరూ పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. ఓపెనర్లు ఎయిడెన్ మార్క్రమ్, రయాన్ రికల్టన్ 82 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పారు. తరువాత కేవలం 3 బంతుల వ్యవధిలో మార్క్రమ్, రికల్టన్ ఇద్దరూ అవుట్ అయ్యారు. ఆ తర్వాత టెంబా బావుమా, ట్రిస్టన్ స్టబ్స్ 84 పరుగుల మరో మంచి భాగస్వామ్యం నెలకొల్పారు. దాంతో రెండు సెషన్లు సఫారీలే ఆధిపత్యం చెలాయించారు.రెండో సెషన్ ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 2 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. అయితే మూడో సెషన్‌లో భారత బౌలర్లు అద్భుతంగా రాణించి వికెట్లు తీశారు. మూడో సెషన్‌లో 26.5 ఓవర్లు బౌలింగ్ చేసి 92 పరుగులు ఇచ్చి 3 విలువైన వికెట్లు తీశారు. మొదటి 2 సెషన్లలో భారత బౌలర్లు కేవలం 2 వికెట్లు తీయగా, చివరి సెషన్‌లో కొత్త బంతి తీసుకున్నాక భారత బౌలర్లు 3 వికెట్లు పడగొట్టారు. రెండో రోజు ఉదయం భారత జట్టు దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను 300 పరుగుల లోపే ముగించాలని భావిస్తుంది. ఆదివారం ఉదయం పిచ్ అనుకూలిస్తే సఫారీలు తొలి సెషన్లో ఆలౌట్ అవుతారు.రెండో టెస్టులో తొలిరోజు కుల్దీప్ యాదవ్ ఆకట్టుకున్నాడు. 3 వికెట్లు కీలక వికెట్లు తీసి దక్షిణాఫ్రికాపై ఒత్తిడి పెంచాడు. కానీ మరో ఎండ్ లో అంతగా సహకారం లభించలేదు. గౌహతి టెస్ట్‌లో మొదటి రోజున భారత్ తరపున విజయవంతమైన బౌలర్‌గా నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ తీశారు. గౌహతిలోని బర్సపరా స్టేడియం తొలిసారిగా టెస్ట్ మ్యాచ్‌కి ఆతిథ్యం ఇస్తోందని తెలిసిందే. మొదటి రోజు దక్షిణాఫ్రికా తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా ట్రిస్టన్ స్టబ్స్ నిలిచాడు. 49 పరుగులు చేసిన స్టబ్స్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో రాహుల్ క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు.దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా 41 పరుగులు చేయగా, మార్క్రమ్ 38, మరో ఓపెనర్ రియాన్




రికెల్టన్ 35 పరుగులు చేశారు. టోనీ డె జోర్జి 28 పరుగులకు సిరాజ్ బౌలింగ్ లో ఔటయ్యాడు. సమష్టిగా ఆడి పరుగులు చేయడంతో ఒక్క హాఫ్ సెంచరీ నమోదు కాకున్నా తొలిరోజు ఆటలో దక్షిణాఫ్రికా 6 వికెట్ల నష్టానికి 247 రన్స్ చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు మార్క్‌రమ్, ర్యాన్ రికెల్టన్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. అయితే బుమ్రా వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో 4 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద మార్క్‌రమ్ ఇచ్చిన సునాయస స్లిప్ క్యాచ్‌ను కేఎల్ రాహుల్ నేలపాలు చేశాడు. ఈ అవకాశాన్ని అతను సద్వినియోగం చేసుకున్నాడు. మరో రెండు రనౌట్ అవకాశాలను కూడా భారత్ చేజార్చుకుంది. ఇక టీ బ్రేక్‌కు ముందు మార్క్‌రమ్‌ను బుమ్రా క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో సౌతాఫ్రికా 82/1 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది.రెండో సెషన్ ఆరంభంలోనే ర్యాన్ రికెల్టన్‌ను కుల్దీప్ యాదవ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో ట్రిస్టన్ స్టబ్స్, టెంబా బవుమా జట్టును ఆదుకున్నారు. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించిన ఈ జోడీ.. ఓపికగా ఆడుతూ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించింది. దాంతో సౌతాఫ్రికా 156/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.మూడో సెషన్‌లో భారత బౌలర్లు చెలరేగారు. 84 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన బవుమా–స్టబ్స్ జోడీని జడేజా విడదీసాడు. హాఫ్ సెంచరీకి చేరువైన బవుమాను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ కాసేపటికే స్టబ్స్‌ను కుల్దీప్ యాదవ్ క్యాచ్ ఔట్ చేసి హాఫ్ సెంచరీ చేయకుండా అడ్డుకున్నాడు. టోనీ డీ జోర్జీ, వియాన్ మల్డర్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేయగా.. కుల్దీప్ యాదవ్ మరోసారి అడ్డుకున్నాడు. మల్డర్(13)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. కొత్త బంతిని అందుకున్న తర్వాత టోర్నీ డీ జోర్జి(26)ని సిరాజ్ కీపర్ క్యాచ్‌గా ఔట్ చేశాడు. ఆ తర్వాత నాలుగు బంతులకే బ్యాడ్ లైట్ కారణంగా ఆట ఆగిపోయింది. తొలి రెండు సెషన్లలో ఒక్కో వికెట్ మాత్రమే తీసిన భారత్.. ఆఖరి సెషన్‌లో మాత్రం 4 వికెట్లు పడగొట్టింది. ఇందులో కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్‌వైపు మలుపు తిప్పాడు.

## గంభీర్ తప్పిదాలు పునరావృతం

సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియా ఓటమికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనాలోచిత నిర్ణయాలే కారణమనే అభిప్రాయం వ్యక్తమైంది. సరైన కాంబినేషన్‌తో బరిలోకి దిగకపోవడం.. పిచ్ కండిషన్స్ తగ్గట్లు జట్టును సిద్ధం చేయకపోవడం.. స్పెషలిస్ట్ బ్యాటర్లకు బదులు ఆల్‌రౌండర్లకు ప్రాధాన్యత ఇవ్వడం, ఏకపక్షంగా టర్నింగ్ ట్రాక్‌ను సిద్ధం చేయడం వంటి తప్పిదాలు టీమిండియా ఓటమికి కారణమయ్యాయనే విమర్శలు వచ్చాయి.ముఖ్యంగా మూడో స్థానంలో సాయి సుదర్శన్‌కు బదులు స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఆడించడం టీమిండియాకు తీవ్ర నష్టం చేసింది. దాంతో సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. ఈ ఓటమి నుంచి గంభీర్ ఏ మాత్రం పాఠాలు నేర్చుకోలేదు.గౌహతి వేదికగా శనివారం ప్రారంభమైన రెండో మ్యాచ్‌లోనూ గంభీర్ అవే తప్పిదాలను పునరావృతం చేశాడు. పిచ్ కండిషన్స్‌ను సరిగ్గా అంచనా వేయలేకపోయిన గంభీర్.. మరోసారి ఆల్‌రౌండర్లకే ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 2 మార్పులతో బరిలోకి దిగింది. శుభ్‌మన్ గిల్, అక్షర్ పటేల్ స్థానాల్లో సాయి సుదర్శన్, నితీష్ కుమార్ రెడ్డి తుది జట్టులోకి వచ్చారు.ఏ మాత్రం ఫామ్‌లో లేని నితీష్ కుమార్ రెడ్డిని తుది జట్టులోకి తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఆస్ట్రేలియా పర్యటనలో సెంచరీ చేసిన తర్వాత అతను ఒక్క మ్యాచ్‌లోనూ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. బౌలింగ్‌లోనూ ప్రభావం చూపడం లేదు. ఈ క్రమంలోనే 8వ స్థానంలో వచ్చి 20 పరుగులు చేసేందుకు నితీష్ కుమార్ రెడ్డిని తీసుకుంటారా? అనే విమర్శలు వస్తున్నాయి.తాజా మ్యాచ్‌లో పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. టీమిండియా ఎక్స్‌ట్రా స్పెషలిస్ట్ పేసర్‌తో బరిలోకి దిగితే అడ్వాంటేజ్‌గా ఉండేది. కానీ నితీష్ కుమార్ రెడ్డిని తీసుకొని మూల్యం చెల్లించుకుంది. అతనితో నాలుగు ఓవర్లు మాత్రమే వేయించిన భారత్.. మళ్లీ బౌలింగ్ ఇవ్వలేదు. ధారళంగా పరుగులివ్వడంతో పక్కనపెట్టింది. ఓవైపు బుమ్రా, సిరాజ్ కట్టడిగా బౌలింగ్ చేసి ఒత్తిడిని పెంచితే నితీష్ పరుగులు వచ్చి ఆ ప్రెజర్‌ను రిలీజ్ చేశాడు. దాంతో పంత్ మళ్లీ అతనికి బంతిని ఇచ్చే సాహసం చేయలేదు.ఈ క్రమంలోనే నితీష్‌ను ఎందుకు తీసుకున్నారనే ప్రశ్నలు వస్తున్నాయి. నితీష్ బదులు మూడో పేసర్‌ను ఆడించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆకాశ్ దీప్, మహమ్మద్ షమీ వంటి పేసర్ అందుబాటులో ఉంటే భారత్‌కు కలిసొచ్చేదనే మాటలు వినిపిస్తున్నాయి. బౌలింగ్‌లో విఫలమైన నితీష్ కుమార్ రెడ్డి.. బ్యాటింగ్‌లోనూ తేలిపోతే గంభీర్‌పై మరిన్ని విమర్శలు రానున్నాయి.

# 2025 యాషెస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం

**తొలి టెస్టులో ఇంగ్లాండ్‌పై ఘన విజయం**

**ఆసీస్‌ను ఊచకోత కోసిన ట్రావిస్ హెడ్**

**10 వికెట్లతో సత్తా చాటిన మిచెల్ స్టార్క్**

ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. 205 పరుగుల లక్ష్యఛేదనలో భాగంగా రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్.. ట్రావిస్ హెడ్(83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లతో 123) విధ్వంసకర శతకంతో 28.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని కైవసం చేసుకుంది.రెండు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్ అసాధారణ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై టీ20 తరహా బ్యాటింగ్‌తో విరుచుకుపడ్డాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగి 36 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేసిన ట్రావిస్ హెడ్.. 69 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అతని దూకుడైన బ్యాటింగ్‌తో హోరాహోరీ తప్పదనుకున్న మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. అతనికి తోడుగా మార్నస్ లబుషేన్(49 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 51 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు.ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ ఒక్కడే రెండు వికెట్లు తీయగా.. మిగతా బౌలర్లు తేలిపోయారు. ఈ విజయంతో ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్‌లో ఆసీస్ 1–0తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్ట్ నవంబర్ 29 నుంచి కాన్‌బెర్రా వేదికగా ప్రారంభం కానుంది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకే కుప్పకూలింది. హ్యారీ బ్రూక్(61 బంతుల్లో 5 ఫోర్లు,




సిక్స్‌తో 52) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. ఓలీ పోప్(58 బంతుల్లో 4 ఫోర్లతో 46), జెమీ స్మిత్(22 బంతుల్లో 6 ఫోర్లతో 33) పర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(7/58) ఏడు వికెట్లతో నిప్పులు చెరిగాడు. బ్రెండన్ డొగ్గెట్(2/27) రెండు వికెట్లు తీయగా.. కామెరూన్ గ్రీన్‌కు ఓ వికెట్ దక్కింది. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకు ఆలౌటైంది. అలెక్స్ క్యారీ(26), కామెరూన్ గ్రీన్(24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ట్రావిస్ హెడ్(21) విఫలమయ్యాడు. బెన్ స్టోక్స్(5/23) ఐదు వికెట్లు తీయగా.. బ్రైడన్ కార్స్ (3/45) మూడు వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్(2/11)కు రెండు వికెట్లు దక్కాయి.ఇక 40 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 164 పరుగులకు ఆలౌటైంది. గస్ అట్కిన్సన్(32 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37), ఓలీ పోప్(57 బంతుల్లో 2 ఫోర్లతో 33) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(3/55)తో పాటు స్కాట్ బోలాండ్(4/33) నాలుగు వికెట్లు పడగొట్టాడు.బ్రెండన్ డొగ్గెట్(3/51) మూడు వికెట్లు తీసాడు. దాంతో ఆసీస్ ముందు 205 పరుగుల లక్ష్యం నమోదైంది. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న ఈ వికెట్‌పై ఈ లక్ష్యాన్ని ఛేదించడం ఆసీస్‌కు కష్టమవుతుందని అంతా అనుకున్నారు. కానీ ట్రావిస్ హెడ్ ఓపెనర్‌గా బరిలోకి దిగి టీ20 బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. ట్రావిస్ హెడ్ ఈ టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఐదో స్థానంలో బ్యాటింగ్ చేసి కేవలం 21 పరుగులే చేశాడు. కానీ, చివరి ఇన్నింగ్స్‌లో ఓపెనింగ్ చేసే అవకాశం రావడంతో, దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. హెడ్ మొదటి నుంచే వేగంగా పరుగులు చేశాడు, పెర్త్ పిచ్‌పై కష్టంగా కనిపించిన 205 పరుగుల టార్గెట్‌ను సులభతరం చేశాడు. కేవలం 36 బంతుల్లోనే హెడ్ తన హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. ఇది యాషెస్ చరిత్రలో మూడవ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డ్. ఆ తర్వాత కూడా హెడ్ ఆగకుండా కేవలం 69 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేశాడు. ఈ వేగంతో ఆస్ట్రేలియా తరపున టెస్టుల్లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన వారి జాబితాలో హెడ్ సంయుక్తంగా మూడో స్థానానికి చేరుకున్నాడు. అలాగే, టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఇది ఐదవ వేగవంతమైన సెంచరీ రికార్డు.ట్రావిస్ హెడ్ చేసిన ఈ సెంచరీ యాషెస్ సిరీస్ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. యాషెస్ సిరీస్ చరిత్రలో ఇది రెండవ అత్యంత వేగవంతమైన సెంచరీ. హెడ్ తన 69 బంతుల సెంచరీతో గిల్‌బర్ట్ జెస్సోప్ రికార్డును బద్దలు కొట్టాడు. జెస్సోప్ 1902లో ఆస్ట్రేలియాపై 76 బంతుల్లో సెంచరీ కొట్టాడు. యాషెస్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డు మాత్రం ఆడం గిల్‌క్రిస్ట్ పేరిట ఉంది. అతను 2006-07 యాషెస్‌లో కేవలం 57 బంతుల్లోనే సెంచరీ సాధించాడు.



# నాగచైతన్య ఎన్‌సి 24 మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్

## మహేశ్‌బాబు చేతుల మీదుగా నేడు విడుదల

అక్కినేని నాగ చైతన్య విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం ఎన్‌సి24. ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మైథలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న ఈ మూవీ నుంచి ఇటీవలే బీటీఎస్ వీడియోను షేర్ చేస్తూ.. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నవంబర్ 23న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు స్టన్నింగ్ లుక్‌తో క్రేజీ వార్తను షేర్ చేశారు మేకర్స్.ఎన్‌సీ 24 ఫస్ట్ లుక్‌ను టాలీవుడ్ స్టార్ యాక్టర్ మహేశ్ బాబు లాంచ్ చేయనున్నాడు. నవంబర్ 23న ఆదివారం నాగచైతన్య బర్త్ డే సందర్భంగా ఉదయం 10:08 గంటలకు ఎన్‌సీ 24 టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేయనున్నాడని తెలియజేస్తూ స్పెషల్ లుక్ ఒకటి విడుదల చేశారు. వారణాసి పోస్టర్‌లో చైతూను మహేశ్‌బాబుతో కలిసి డిజైన్ చేసిన పోస్టర్ షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది.




# ప్రభాస్ ఫౌజీపై ప్రీక్వెల్ ఊహాగానాలు...

ఇప్పటి వరకు రెబల్ స్టార్ 'ప్రభాస్' సీక్వెల్ మూవీస్ మాత్రమే చేశారు. రెండు భాగాలుగా వచ్చిన 'బాహుబలి' భారీ విజయాన్ని సాధించగా.. నెక్ట్స్ కల్కి 2, సలార్ 2 రెడీ అవుతున్నాయి. ఈ లిస్ట్‌లో రాజాసాబ్ కూడా ఉంది. అయితే ఇవన్నీ సీక్వెల్స్ మాత్రమే. ఇప్పుడు ఓ సినిమాకు ప్రీక్వెల్ ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాల్లో 'ఫౌజీ' కూడా ఒకటి. సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగష్టులో ఈ సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఫౌజీ చిత్రానికి ప్రీక్వెల్ చేసే ప్లానింగ్‌లో ఉన్నారట రాఘవపూడి. ఇప్పటి వరకు వచ్చిన ఫౌజీ అవుట్ పుట్ పట్ల ప్రభాస్ చాలా హ్యాపీగా ఉన్నారట. హను వర్క్‌కు ఫిదా అవుతున్నాడట డార్లింగ్. అందుకే ఆయనతో మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఓ టాక్ ఉంది. ఇప్పుడు దాదాపుగా ప్రీక్వెల్ ఫిక్స్ అయినట్టేనని తెలుస్తోంది. అయితే ఫౌజీ రిజల్ట్‌ను బట్టి ఈ ప్రాజెక్ట్ ఉంటుందా?, ఉండదా? అనేది డిసైడ్ కానుంది. పౌజీ హిట్ అయితే ప్రీక్వెల్ ఉండే ఛాన్స్ ఉంది, లేదంటే లేదు. ఏదేమైనా ఫౌజీ మాత్రం మామూలుగా ఉండదనేది ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. యుద్ధంలో పుట్టిన ప్రేమకథగా ఈ సినిమా ఉంటుందని ముందు నుంచి ప్రచారంలో ఉంది. మరి ఈసారి హను ఎలా ప్లాన్ చేస్తున్నాడో చూడాలి.

# కార్తికేయ పుట్టినరోజు

## విషెస్ తెలిపిన మహేశ్, ప్రియాంక

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తనయుడు, యువ నిర్మాత ఎస్.ఎస్. కార్తికేయ శనివారం తన 34వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమలోని ప్రముఖులతో పాటు 'వారణాసి' చిత్ర బృందం ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అయితే తాజాగా కార్తికేయకి సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో పాటు గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్‌బాబు ఎక్స్ వేదికగా కార్తికేయకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ.. మేము నిర్మించే ప్రతిదాని వెనుక ఉండే నిశ్శబ్దపు శక్తివి నువ్వే. హ్యాపీ బర్త్‌డే కార్త్. అత్యంత కష్టమైన పనులను కూడా నువ్వు ఎంత సులువుగా, కూల్‌గా చక్కబెడతావో చూస్తుంటే నాకు ఎప్పుడూ ఆశ్చర్యం కలుగుతుంది. రాబోయే సంవత్సరంలో కూడా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నా అంటూ మహేశ్ రాసుకోచ్చాడు. అలాగే ప్రియాంక చోప్రా కార్తికేయకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ.. తేలికగా తీసుకో నా మిత్రమా! ప్రతి పని వెనుక నిశ్శబ్దంగా నిలబడే వ్యక్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈ సినిమా (వారణాసి) ప్రయాణంలో నీతో కలిసి డాన్స్ చేయగలుగుతున్నందుకు చాలా సంతోషంగా ఉందంటూ ప్రియాంక చోప్రా రాసుకోచ్చింది. ఈ పోస్ట్‌కి ఒక వీడియోను పంచుకుంది. ఈ వీడియోలో 'ప్రేమికుడు'లోని సూపర్ హిట్ పాట 'ఊర్వశి.. ఊర్వశి' పాటకు కార్తికేయతో కలిసి సరదాగా స్టెప్పులేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కార్తికేయ ప్రస్తుతం 'వారణాసి'కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.





# మహిళలు బలహీనులు కాదు.. బలవంతులు

## నటి రష్మిక మందన్నా కామెంట్స్

ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకెళ్తున్న హీరోయిన్ రష్మిక మందన్నా, భాష ఏదైనా పట్టించుకోకుండా వరుస సినిమా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. అదే వేగంతో విజయాలు కూడా అందిపుచ్చుకుంటూ స్టార్ హీరో రేంజ్ ఫ్యాన్‌బేస్‌ను సంపాదించుకుంది. తాజాగా విడుదలైన 'గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న రష్మిక, సినిమాలకే కాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండి అభిమానులతో కంటిన్యూ టచ్‌లో ఉంటుంది. ఇటీవల ఆమె స్త్రీశక్తి గురించి ఓ ఆసక్తికరమైన పోస్ట్‌ను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. అమ్మాయిలంతా ఏకమై నిలిస్తే ఆ శక్తిని ఎవరూ ఆపలేరని ఆమె స్పష్టంగా తెలిపింది. మహిళల మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం వేరే స్థాయిలో ఉంటుందని, మంచి స్నేహితురాలితో దగ్గరైతే జరగబోయే విషయాలు ముందే అర్థమైపోతాయనే ఫీలింగ్ కలుగుతుందని చెప్పింది. స్త్రీలు ఒకరికొకరు మద్దతు ఇస్తే జీవితం మరింత సులభమవుతుందని, వారు బలహీనులు కాదు, ఎంతో ప్రేమతో, బలంతో ఉండే వ్యక్తులని రష్మిక పేర్కొంది. ఎల్లప్పుడూ తనతో ఉండే స్నేహితురాళ్లకు కృతజ్ఞతలు చెబుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో కూడా ఇలాంటి మంచి ఫ్రెండ్స్ ఉండాలని కోరుకుంటు న్నానని ఆమె చెప్పింది.



# వారణాసిలో మ్యూజిక్ అదుర్స్

## ఆరు పాటలుంటాయని హింట్ ఇచ్చిన కీరవాణి

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. ప్రజలు కూడా ఈ మూవీపై క్యూరియసిటీతో ఉన్నారు. తాజాగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమాపై మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. 'వారణాసి'లో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. 'అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతాన్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. 'వారణాసి'లో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసే పని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడిగా కూడా ఉండదు. నాకు ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందరగోళం లేదని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో 'రణ కుంభ' ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ సృష్టిస్తోంది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'స్టూడెంట్ నెం.1', 'యమదొంగ', 'మగధీర', 'ఈగ', 'బాహుబలి'లోని పాటలు నేటికీ సోషల్‌మీడియా రీల్స్‌లో వైరల్ అవుతూనే ఉన్నాయి. ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'వారణాసి'కి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో పలు భాషలకు చెందిన అగ్రతారలు నటిస్తున్న నేపథ్యంలో దీని బ్జడెట్‌పై వార్తలు వెలువడుతున్నాయి. వీరికి భారీ పారితోషికం ఇవ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రబ్జడెట్ ఏకంగా రూ.1100 కోట్లని ప్రచారం జరుగుతోంది. 2027 వేసవిలో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# దమ్ముంటే ఆధారాలతో నిరూపించు.. లేదంటే క్షమాపణ చెప్పు..

- మీ ఫ్రీహోల్డ్ జీవోల వెనుకున్న 'రూ. లక్షల కోట్ల మతలబు' ఏంటి?
- ఏ ప్రభుత్వ భూమిని అమ్మకానికి పెట్టలేదు.. ముందు వాస్తవాలు తెలుసుకో
- 9292 ఎకరాల ఇండస్ట్రియల్ పార్కుల్లో... పరిశ్రమలకు ప్లాటింగ్ చేసింది 4740 ఎకరాలే..
- రాష్ట్రానికి కొత్తగా పెట్టుబడులు రావద్దనేదే మీ అజెండా.. అర్థమవుతుంది..
- హరీష్ రావు 'అవాస్తవాల'పై మంత్రి శ్రీధర్ బాబు స్ట్రాంగ్ కౌంటర్




**హైదరాబాద్, నవంబర్ 22 (సమయం న్యూస్):** 'ఆరోపణలు చేయడం, అబద్దాలు ప్రచారం చేయడం బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావుకు వెన్నతో పెట్టిన విద్య' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండిపడ్డారు. తిమ్మిని బమ్మిని చేయడంలో వారిని మించిన వారు మరొకరు లేరని మరోసారి నిరూపించుకున్నారంటూ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎద్దేశా చేశారు. వారు పదేపదే ప్రస్తావిస్తున్న రూ.5 లక్షల కోట్ల స్కాం ఆరోపణ పూర్తిగా నిరాధారం, అవాస్తవమని మరోసారి స్పష్టం చేశారు. దమ్ముంటే ఆధారాలను బయటపెట్టి మాట్లాడాలని సవాలు విసిరారు. లేదంటే.. మీరు పదే పదే చేస్తున్న ప్రచారం కేవలం పచ్చి అబద్ధం, రాజకీయ దురుద్దేశం అని ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'మీరు అధికారం కోల్పోయారనే బాధతో రూ. 5 లక్షల కోట్ల స్కాం అంటూ పాత రికార్డును పదే పదే వాయించే బదులు... మీరు ఆగస్టు 2023లో తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోల (19, 20, 21) వెనుక ఉన్న 'రూ. లక్షల కోట్ల మతలబు' గురించి ముందు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి' అని ఆయన డిమాండ్ చేశారు. గతంలో మంత్రిగా సుదీర్ఘ అనుభవమున్న హరీష్ రావు తమ ప్రభుత్వంపై ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పారదర్శకంగా రాష్ట్ర ఖజానాకు రూ. 4వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు తాము ప్రయత్నిస్తుంటే... స్కాంలు చేసి చేసి అలవాటైన బీఆర్ఎస్ నేతలకు మాత్రం ఇది మింగుడు పడటం లేదన్నారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు ప్రభుత్వ లీజ్ ల్యాండ్స్ కు ఫ్రీహోల్డ్ రైట్స్ ఇచ్చి, 100 శాతం, 200 శాతం ఛార్జీలు విధించి మీరు వసూలు చేద్దామనుకున్న రూ.లక్షల కోట్ల సంగతేంటంటూ ప్రశ్నించారు. అసలు ప్రభుత్వంతో సంబంధం లేని సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు నమ్ముతారనే భ్రమ నుంచి బయటకు రావాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా యువతకు ఉద్యోగాలు దక్కకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. వాస్తవాలను దాచిపెట్టి తమ ప్రభుత్వం 9292 ఎకరాలు అమ్మకానికి పెట్టిందంటూ తమపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ భూముల్లో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసిన ఏరియా లేదా ఫ్రీ హోల్డ్ ప్రాపర్టీస్ కేవలం 4,740 ఎకరాలేనని, ఇవి పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూములని స్పష్టం చేశారు. మిగిలిన భూములు రోడ్లు, డ్రెయినేజీ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా నిజనిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

# చెరుకు రైతుల సమస్యలపై కమిటీ

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్ నవంబర్22( సమయం న్యూస్):** చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారాలు సూచించేందుకు ఉన్నతాధికారులతో ఒక కమిటీని నియమిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. శనివారం సచివాలయంలో ఆయన చెరుకు రైతులు, పరిశ్రమల ప్రతినిధులు, చెరుకు అభివృద్ధి మండళ్ల (సిడిసి) ఛైర్మన్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమేవేశం నిర్వహించారు. తెలంగాణాలో ఏటా చెరుకు సాగు విస్తీర్ణం తగ్గుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని చక్కెర పరిశ్రమల సమస్యలు కూడా పరిష్కరించాలన్న సంకల్పంతో సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారని శ్రీధర్ బాబు తెలిపారు. సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన ప్రధాన అంశాలపై అందరితో చర్చించి నివేదిక రూపొందించేందుకు ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించనున్నట్టు ఆయన వెల్లడించారు. ఇందులో సంబంధిత శాఖల అధికారులు, చక్కెర పరిశ్రమల ప్రతినిధులు కూడా ఉంటారని చెప్పారు. ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లో చెరుకు రైతులకు అందుతున్న ప్రయోజనాలు, రాయితీలపై అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరలో నివేదిక అందిస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. ప్రతి క్వింటాలు సన్న ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్ ను చెరుకు పంటకు కూడా వర్తింపచేయాలని రైతులు కోరుతున్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని శ్రీధర్ బాబు అన్నారు. చెరుకు హార్వెస్టర్ యంత్రాలపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీని ఇవ్వగా ఆ తర్వాత వచ్చిన బిఆరెస్ ప్రభుత్వం ఆ రాయితీని తొలగించిన విషయం రైతులు చెబుతున్నారని ఆయన వెల్లడించారు. కూలీల సమస్య వల్ల చెరుకు నరకడం రైతులకు సమస్యగా మారిందని అన్నారు. తన నియోజకవర్గం మంథనిలో పత్తి తీసే కూలీల కొరత వల్ల ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర నుంచి లేబర్ వస్తున్న విషయం తనకు తెలుసునని శ్రీధర్ బాబు వివరించారు. డ్రిప్ ఇరిగేషన్ రాయితీని చెరుకు పంటకు కొనసాగించాలని రైతులు కోరుతున్న విషయపై కూడా అధికారుల కమిటీ నివేదిక ఇస్తుందని తెలిపారు. డ్రిప్ పరికరాల వల్ల ప్రతి ఎకరానికి 8-9 టన్నుల దిగుబడి పెరుగుతుందని అధికారులు చెబుతున్నారని అన్నారు. చెరుకు రవాణా ఛార్జీలను కొంత మేరకు భరించే అంశాన్ని కూడా కమిటీ అధ్యయనం చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణాలోని ప్రైవేటు రంగ చక్కెర పరిశ్రమలను కాపాడుకుంటామని తెలిపారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణ విషయంలో వారి అనుభవాన్ని వినియోగించుకుంటామని తెలిపారు. కార్మికులు, రైతుల శ్రేయస్సుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని వివరించారు. ఏపీలో చక్కెర రికవరీ శాతం 9 శాతం ఉండగా, రాష్ట్రంలో 11 శాతం వరకు వస్తుండటం సంతోషం కలిగించే అంశమని చెప్పారు. చెరుకు విస్తీర్ణం పెరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని శ్రీధర్ బాబు వెల్లడించారు. సమావేశంలో తెలంగాణా పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, చక్కెర పరిశ్రమల డైరెక్టర్ నర్సిరెడ్డి, పలువురు అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, సిడిసి ఛైర్మన్లు, రైతులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం

**మెదక్ ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి**

**మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు**



**మెదక్, నవంబర్ 22 (సమయం న్యూస్):** మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కార్మిక, గనుల శాఖ మంత్రి, మెదక్ ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 1లక్ష 27వేల కుటుంబాలకు ఉచిత కరెంటు ఇస్తున్నామని, 1లక్ష 26వేల కుటుంబాలకు రూ.500లకే గ్యాస్ కనెక్షన్ అందించామని తెలిపారు. 9వేల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టామని, దానికి రూ.57వేల కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా రూ.100 కోట్ల సబ్సిడీని మహిళల ప్రయాణం ద్వారా ఆర్టీసీకి అందించామన్నారు. రూ.21 కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని, రాష్ట్రంలో సమర్థవంతంగా 6 గ్యారంటీ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు మహిళలు బ్యాంకులకు వెళ్లాలన్న ఇబ్బంది పడేవారిని, కానీ ఇప్పుడు మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తుండడంతో ఆడపడుచులు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చెక్కుల కోసం చాలామంది మహిళలు ఎదురుచూస్తున్నారని, ప్రతినెల మంత్రి నియోజకవర్గంలో వచ్చి ఇస్తే ఇంకా సంతోషంగా ఉంటుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయి నల్లగా మారిందని, ఆ ధాన్యాన్ని కొని డబ్బులు రైతుల ఖాతాలో వేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో, తండాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని, వాటిని మరమ్మతులు కోరారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తుండడంతో ఆయా గ్రూపులకు బ్యాంకుల ద్వారా లక్షల వరకు కూడా వడ్డీ లేని రుణాలు అందిస్తుండడం గర్వకారణం అన్నారు. ఈ రుణాలతో ఆయా సంఘాల సభ్యులు వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగడం సంతోషకరమన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు మహిళా సంఘాలకు అప్పగించడంతో అక్కడ కూడా వారు సంపాదించుకునే అవకాశం కలిగిందన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించే కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించడం, గ్యాస్ సబ్సిడీ చెల్లిస్తుండడం, ఉచిత బస్సు సౌకర్యం వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడంతో జిల్లాలో వీటి నిర్మాణం వేగవంతమైందని, ఒక్క గుడిసెలేని గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం పేదలందరికీ పక్కా గృహాలు నిర్మిస్తుందన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యే కలెక్టర్ తో కలసి పలువురు మహిళలకు ఇందిరమ్మ చీరలతో పాటు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ సుహాసిని రెడ్డి, ఫ్యాక్స్ చేర్మెన్లు, ఆర్డీఓ మైపాల్ రెడ్డి, డఆర్డిఓ శ్రీనివాస రావు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, తహశీల్దార్లు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**ఖమ్మం ,నవంబర్ 22: ( సమయం న్యూస్ ):** మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ లతో కలిసి బోనకల్ లో కోటి 75 లక్షల రూపాయలతో నిర్మించనున్న ఇందిర మహిళా డెయిరీ ప్రహరీ గోడ, గ్రౌండ్ లెవెలింగ్ పనులకు భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబాలు బాగు పడతాయని ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు. మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ప్రత్యేకంగా ఇందిరా మహిళా డెయిరీని ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టిందని, ప్రతి ఒక్కరికి చీర తప్పకుండా ఇంటికి అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, డిఆర్డిఓ సన్యాసయ్య, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అప్పులపై తప్పుడు ప్రచారం

**రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు**

**హైదరాబాద్, నవంబర్ 22 (సమయం న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, ముఖ్యంగా గత ప్రభుత్వం చేసిన అప్పులపై పదేపదే చెబుతున్న 'కాకి లెక్కల' డొల్లతనం కాగ్ నివేదిక ద్వారా మరోసారి పూర్తిగా బట్టబయలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాగ్ నివేదిక అక్టోబర్ నెల కోసం విడుదల చేసిన లెక్కల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు అప్పులు వాటికి కడుతున్న వడ్డీలను తన నివేదికలో చాలా స్పష్టంగా పేర్కొన్నదని కేటీఆర్ తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ పదేపదే అప్పుల కాకి లెక్కలు అన్ని మరోసారి తేలిపోయాయని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టడానికే ప్రభుత్వ ఆదాయం, కొత్త అప్పులు సరిపోతున్నాయంటూ కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని కాగ్ తాజా లెక్కలు పూర్తిగా కొట్టిపారేశాయని ఆయన ధ్వజమెత్తారు. అదే విధంగా, గత 7 నెలలుగా వివిధ కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పుల వివరాలను కూడా తక్షణమే ప్రజల ముందు ఉంచాలి. వీటితోపాటు ఈ అంశంలో ప్రజలను ముఖ్యంగా శాసనసభను తప్పుదోవ పట్టించినందుకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని కేటీఆర్ మరోసారి డిమాండ్ చేశారు. ప్రతి నెలా రూ. 6,000 నుంచి రూ. 7,000 కోట్లు వడ్డీల కోసమే చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. కానీ కాగ్ ఇచ్చిన తాజా నివేదిక కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అబద్ధాల పైన మరోసారి చెంప దెబ్బ లాంటి వాస్తవాలను బయటపెట్టింది అని కేటీఆర్ విమర్శించారు.

# రవాణా శాఖలో ఎన్ఫోర్స్మెంట్ను మరింత కఠినతరం చేయండి

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్ నవంబర్22( సమయం న్యూస్):** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి కొద్ది రోజులుగా రవాణా శాఖ అమలు చేస్తున్న సంస్కరణలపై మరింత కఠిన తరం చేసేలా రవాణా శాఖ ఉన్నత స్థాయి అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి మరణాల రేటును నివారించే విధంగా అధికారులు పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఇందుకోసం ఎన్ఫోర్స్మెంట్ వేగవంతం చేయడానికి ఇటీవల రవాణా శాఖలో 33 జిల్లా స్థాయి బృందాలు, మూడు రాష్ట్రస్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసింది. ఇందులో డిటిసి, ఆర్టిఏ ఇతర అధికారులు నిరంతరం ఇందులో తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీలు ఏ బృందం ఎక్కడ చేపడుతుంది అనేదానిపై ముందస్తు సమాచారం లేకుండా ప్రతి రోజు ఉదయం 6 గంటలకి ఆయా బృందాలకు సమాచారం అందించి తనిఖీలు చేపట్టింది. గత 10 రోజుల వ్యవధిలో తనిఖీలు చేపట్టడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపైన 4748 కేసులు నమోదు చేయబడ్డాయి. మొత్తం 3420 వాహనాలు సీజ్ చేయబడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్ఫోర్స్మెంట్ బృందాలు మరింత తనిఖీలు ముమ్మరం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల ఆదేశించారు. హెవీ వెహికల్ డ్రైవర్ కి లైసెన్సు రెన్యువల్ సమయంలో పునఃశ్చరణ తరగతులు ఏర్పాటు చేసేలా కార్యాచరణ తీసుకోవాలని సూచించారు. రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తున్న సమాచారాన్ని ప్రజల నుండి సమాచారం వచ్చిన రవాణా శాఖ అధికారులు వెంటనే స్పందించాలని ఆదేశించారు. రవాణా శాఖలో పెండింగ్ లో ఉన్న ఖాళీల భర్తీ చేయడంతో పాటు , ప్రమోషన్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పది రోజులకు ఒకసారి ఎన్ఫోర్స్మెంట్ పై సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి , రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి , జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్లు రమేష్, చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య లు పాల్గొన్నారు.